RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 264 శనివారం 18 అక్టోబర్ 2025 పేజీలు : 4 వెల : రూ. 2.00

## 100 జిల్లాల్లో పీఎం ధన ధాన్య కృషి

న్యూఢిల్లీ : వ్యవసాయాభివృద్ధికీ, రైతు సంక్షేమానికీ తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ప్రధాని మోదీ తెలిపారు. దేశంలో వ్యవసాయ సామర్థ్యాన్ని పూర్తిగా ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అందుకే, దేశంలోని తక్కువ పంట దిగుబడి, ఉత్పాదకత ఉండే వెనుకబడిన జిల్లాల్లో వ్యవసాయానికి ప్రోత్సాహం అందించేందుకు పీఎం ధన ధాన్య కృషి యోజన పథకానికి శ్రీకారం చుట్టినట్టు వెల్లడించారు. దేశవ్యాప్తంగా తొలుత ఎంపిక చేసిన 100 జిల్లాల్లో అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. 2025-26 బడ్జెట్‌కు సంబంధించి వ్యవసాయం-గ్రామీణాభివృద్ధిపై ఏర్పాటుచేసిన వెబినార్‌లో వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని మోదీ మాట్లాడారు.

బడ్జెట్‌లో ప్రతిపాదించిన వ్యవసాయ సంబంధ కార్యక్రమాలను ముందుగా మొదలుపెట్టాలని అధికారులను కోరారు. ప్రస్తుతం దేశంలో పప్పుధాన్యాల ఉత్పత్తి పెరిగిందని, అయినప్పటికీ దేశీయ వినియోగంలో 20% ఇప్పటికీ దిగుమతులపైనే ఆధారపడాల్సి వస్తోందని చెప్పారు.




## నేడు తెలంగాణలో బీసీ సంఘాల బంద్ - 42శాతం రిజర్వేషన్ల డిమాండ్-అన్ని పార్టీల సపోర్ట్ !

హైదరాబాద్ : తెలంగాణలో బీసీ సంఘాలు శనివారం రాష్ట్రవ్యాప్త బంద్కు పిలుపునిచ్చాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ బంద్ జరుగుతోంది. హైకోర్టు ఇటీవల జారీ చేసిన స్టే ఆర్డర్కు వ్యతిరేకంగా ఈ ఆందోళన చేపట్టారు. బీసీలకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని సంఘాలు ప్రకటించాయి. ఈ బంద్కు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ సహా పలు పార్టీలు మద్దతు తెలిపాయి. తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు జారీ చేసిన జీవోపై హైకోర్టు అక్టోబర్ 9న స్టే విధించింది. దీనికి వ్యతిరేకంగా బీసీ సంఘాలు బంద్కు పిలుపునిచ్చాయి. బీసీలు ఇప్పటికీ సామాజిక వివక్షకు గురవుతున్నారని, వారికి సమాన హక్కులు, గౌరవం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. కోర్టులు బీసీలకు అన్యాయం చేస్తున్నాయని ఆరోపిస్తూ, 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని పట్టుబడుతున్నారు. రాహుల్ గాంధీ హామీ మేరకు సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ కుల గణన సర్వే నిర్వహించామని కాంగ్రెస్ పేర్కొంది. బీసీ జాయింట్ యాక్షన్ కమిటీ (బీసీ జేఏసీ) ఈ బంద్ను నిర్వహిస్తోంది. జేఏసీ చైర్మన్, బీజేపీ రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య నేతృత్వంలో ఈ ఆందోళన జరుగుతోంది. ప్రజలు శాంతియుతంగా పాల్గొనాలని, దుకాణాలు, వ్యాపార సంస్థలు మూసివేయాలని కోరారు. ఆర్టీసీ బస్సులు నడపకూడదని పిలుపునిచ్చారు.

## రాజ్ భవన్ ముందు బైఠాయించిన సీపీఎం
## అఖిల పక్షాన్ని తీసుకెళ్లాలంటున్న డిప్యూటీ సీఎం
## రామచందర్‌రావు ముందుకు రావాలన్న భట్టి విక్రమార్క
## బీసీ రిజర్వేషన్ల కోసం బీజేపీ పైనా ఒత్తిడి తేస్తామన్న కృష్ణయ్య
## బీజేపీ బంద్ లో పాల్గొంటోందంటే బిల్ పాస్ చేసినట్టు భావించాలా: జాగృతి అధ్యక్షురాలు కవిత

హైదరాబాద్: బీసీ రిజర్వేషన్లపై అన్ని పార్టీలు, బీసీ సంఘాలు బీజేపీనే టార్గెట్ చేస్తున్నాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తలుచుకుంటే 42% రిజర్వేషన్లు సాధ్యమేనని, కావాలనే గవర్నర్ వద్ద ఆర్డినెన్స్ ఆపాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ లో చేర్చి రిజర్వేషన్లను పెంచడం కూడా సాధ్యమేనని అంటున్నారు. బీసీ సంఘాల జేఏసీ ఇచ్చిన రేపటి బంద్ కు అన్ని పార్టీలూ మద్దతు పలికాయి. కొద్ది సేపటి క్రితం ఇదే విషయమై సీపీఎం నాయకులు గవర్నర్ ను కలిసేందుకు రాజ్ భవన్ కు రాగా.. లోనికి అనుమతించలేదు. దీంతో వారు రాజ్ భవన్ వద్ద ఆందోళనకు దిగారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లకు బీజేపీ అడ్డంకి అని విమర్శించారు. ఈ ఆందోళనలో ఎస్ వీరయ్య, సాగర్, తమ్మినేని వీరభద్రం తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా రేపటి బంద్ ను విజయవంతం చేయాలని కోరుతూ ఆర్ కృష్ణయ్య, మందకృష్ణమాదిగ, అద్దంకి దయాకర్ సహా పలువురు నేతలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అద్దంకి మాట్లాడుతూ.. బీజేపీ అనుకుంటే బీసీలకు 42% రిజర్వేషన్లు సాధ్యమేనని అన్నారు. తెలంగాణ అసెంబ్లీ, కౌన్సిల్ పాస్ చేసిన బిల్లులను ఆమోదించకుండా నెలల తరబడి పెండింగ్ లో పెట్టిన బీజేపీ ఇప్పుడు బంద్ లో పాల్గొంటోంది.. అంటే బీసీ రిజర్వేషన్ల బిల్లులు పాస్ చేసినట్టు భావించాలా? అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ దక్కకుండా అడ్డుకున్నది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాత్రమే అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు.




రాష్ట్రం నుంచి అఖిలపక్షంగా వచ్చి రాష్ట్రపతిని, ప్రధానమంత్రిని కలుస్తామని అడిగినా అపాయింట్ మెంట్ ఇవ్వలేదని మండిపడ్డారు. ప్రధాని, రాష్ట్రపతి అపాయింట్ మెంట్ ఇప్పించేందుకు బీజేపీ స్టేట్ చీఫ్ రాంచందర్ రావు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా బీజేపీ నుంచి రాజ్యసభ ఎంపీగా కొనసాగుతున్న ఆర్ కృష్ణయ్య నిన్న మీడియాతో మాట్లాడుతూ.. తాను ఏ పార్టీలో చేరలేదని, బీసీ ఉద్య నాయకుడిగా పార్టీలే తనను చేర్చుకున్నాయని అన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం బీజేపీపైనా ఒత్తిడి తెస్తానని కుండబద్దలు కొట్టారు. దీంతో ఇప్పుడు బీసీ రిజర్వేషన్ల విషయంలో అందరి వేళ్లూ బీజేపీని చూపిస్తుండటం గమనార్హం.

## మావోయిస్టుల లొంగుబాటు: ప్రాణమా-వ్యూహమా?!




కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ప్రారంభంలో మొదలు పెట్టిన ఆపరేషన్ కగార్ మావోయిస్టులకు సింహ స్వప్నంగా మారిందన్నది వాస్తవం. చర్చలకు అవకాశంలేదని.. లొంగుబాటా.. ప్రాణాల అర్పణా? అన్నట్టుగా సాగుతున్న భీకర పోరులో ఇప్పటికే చాలా మంది మావోయిస్టులు, పార్టీ అధికార ప్రతినిధుల నుంచిసిద్ధాంత కర్తల దాకా.. భద్రతా దళాల తుపాకులకు బలయ్యారు. దీనిలో ఎలాంటి సందేహం లేదు. ఈ క్రమంలోనే మావోయిస్టులు పెద్ద ఎత్తున లొంగిపోతున్నారు. అయితే.. మావోయిస్టులు ఇలా భారీ ఎత్తున లొంగిపోవడానికి ప్రాణ భయమే కారణమని కొందరు చెబుతుం టే.. కాదు.. దీని వెనుక.. చాలా వ్యూహం ఉండి ఉంటుందని మరికొందరు చెబుతున్నారు. వాస్తవానికి మావోయిస్టులు గన్ను పట్టుకునేప్పుడే.. ప్రాణాలను లెక్కచేయబోమని.. డబ్బులు, ప్రలోభాలకు లొంగమని ప్రతిజ్ఞ చేస్తారు. అందుకే సర్వస్వం వదిలి అడవిబాటలో అడుగులు వేస్తారు. సొమ్మసిల్లినా.. ప్రాణాలు పోయినా.. మన్యాన్నే నమ్ముకుంటారు. ఇదే ఇప్పటి వరకు జరిగింది. అలాంటి వారు.. ఇప్పుడు ప్రాణభయంతో లొంగిపోతున్నారా? అనేది ప్రశ్న. ఇది మేధావుల మధ్యే పెద్ద ఎత్తున వస్తున్న సందేహం. అంతేకాదు.. ఆపరేషన్ కగార్ నిజంగానే వారిని మార్చేసిందా? అనేది ప్రశ్న. అయితే.. ఈ విషయంపై చాలా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో యూపీఏ ప్రభుత్వం ఉన్నప్పుడు.. ఆపరేషన్ గ్రీన్ హంట్ పేరుతో కూడా ఇలాంటి దాడులే చేసింది. అప్పట్లోనూ పదుల సంఖ్యలో మావోయిస్టులు మృతి చెందారు. కానీ.. అప్పట్లో ఈ తరహా లొంగుబాట్లు లేవు. ఇక, ఇప్పటికి.. అప్పటికి ఉన్న తేడా.. అప్పట్లో చర్చలకు ఆహ్వానించారు. అవి సాకారం కాకపోవడంతో తిరిగి మావోయిస్టులు అడవి బాట పట్టారు. ఇప్పుడు చర్చల ఊసు లేదు. ఒకరకంగా.. తీవ్ర దిగ్బంధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో మావోయిస్టులు చాలా వ్యూహాత్మకంగానే లొంగిపోతున్నారన్నది వీటి నుంచి బయటకు వచ్చిన వారు చెబుతున్న మాట. అలివికాని సమయంలో ఎదురొడ్డడం కంటే.. ముందు లొంగిపోయి.. తర్వాత.. సానుకూల వాతావరణం ఏర్పడినప్పుడు.. తిరిగి అడవిబాటపట్టడం ఖాయమని అంటున్నారు. ఇది గతంలోనూ జరిగిందని గుర్తు చేస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం.. దిగ్బంధం చేసినప్పుడు.. కూడా ఇలానే కొందరు లొంగిపోయి.. తర్వాత.. మళ్లీ వారి బాటలోకి వెళ్లిపోయారు. ప్రభుత్వాలు అనుసరించే వ్యూహాలను బట్టి మావోయిస్టుల వ్యూహాలు కూడా ఉంటాయని మేధావులు గుర్తు చేస్తున్నారు. మావోయిస్టుల సిద్ధాంతాలను ఏర్పరిచిన మల్లోజుల వంటివారు లొంగిపోవడం అంటే.. సాధ్యమా? అనేది ప్రశ్న. దీనివెనుక వ్యూహం ఉంటుందని చెబుతున్నారు. అయితే.. దీనిపై కేంద్రం కూడా అనుమానాలు వ్యక్తం చేస్తోంది. అందుకే.. తాజాగా హోం మంత్రి అమిత్‌షా.. మరో రెండేళ్లపాటు.. నిఘా కొనసాగుతుందని చెప్పారు. సో.. ఉద్యమానికి అలవాటైన ప్రాణం.. అంత త్వరగా తుపాకులు వదిలేయదని చెబుతున్నమాట ఏమేరకు వాస్తవమో చూడాలి.




హైదరాబాద్, అక్టోబర్ 17: కేంద్ర ప్రభుత్వం పత్తిని పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో వరితో పాటు అత్యధికంగా సాగవుతున్న పంట పత్తి అని.. రాష్ట్రంలో 45లక్షల ఎకరాల్లో పత్తి సాగు అవుతోందని తెలిపారు. 22 లక్షలకు పైగా రైతులు పత్తిని పండిస్తున్నారన్నారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొనుగోలు చేస్తుందని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పూర్తి స్థాయిలో సహకారం అందిస్తోందన్నారు. పత్తి రైతులు దళారుల చేతిలో పడి మోస పోవద్దని సూచించారు. కేంద్ర ప్రభుత్వం చివరి క్వింటాల్ వరకు కొనుగోలు చేస్తుందని ప్రకటించారు. క్వింటాల్ పత్తి రూ.8,110 ధరకు సీసీఐ ద్వారా కొనుగోలు చేస్తుందన్నారు. తెలంగాణలో పత్తి సాగు ఉత్పత్తి పెరుగుతోందని.. పత్తి ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ ముందు ఉందన్నారు. కొనుగోలు కేంద్రాలను మరో 12పెంచామని.. మొత్తం 122 కొనుగోలు కేంద్రాలు పని చేస్తున్నాయని తెలిపారు కేంద్రమంత్రి. పత్తి సాగు ఉత్పత్తిలో సంస్కరణలు తీసుకువస్తున్నామన్నారు. తొమ్మిది ప్రాంతీయ భాషల్లో పత్తి సాగుకు సంబంధించి కిసాన్ యాప్‌ను తీసుకొచ్చామని.. యాప్‌లో రైతులు నమోదు చేసుకుంటే.. స్లాట్ ద్వారా పత్తిని కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవచ్చని అన్నారు. పత్తి శుద్ధి, రవాణా కోసం జిన్నింగ్ మిల్లులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. హై డెన్సిటీ ప్లాంటేషన్ వల్ల పంట దిగుబడి డబుల్ అవుతుందని తెలిపారు. మహారాష్ట్ర అకోలా ప్రాంత ప్రజలు హై డెన్సిటీ ప్లాంటేషన్ చేస్తున్నారని.. హై డెన్సిటీ ప్లాంటేషన్‌పై అవగాహన కోసం అవసరమైతే రైతులను మహారాష్ట్రకు తీసుకెళ్తామని చెప్పారు. వచ్చే ఏడాది నుంచి మన రైతులు హై డెన్సిటీ ప్లాంటేషన్ చేసేలా పని చేస్తామన్నారు. కిసాన్ యాప్ దీపావళి నుంచి అందుబాటులోకి వస్తుందని తెలిపారు. పదేళ్లలో కనీస మద్దతు ధర వంద శాతం పెరిగిందన్నారు.

నకిలీ విత్తనాల విషయంలో ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరిస్తున్నాయని.. నకిలీ విత్తనాలు అమ్మే వారిపై పీడీ యాక్ట్ పెట్టి జైలుకు పంపుతున్నామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.




## రసవత్తరంగా "జూబ్లీహిల్స్" రాజకీయం!

## ప్రచారంలోకి ఆ ముగ్గురు బిగ్ పొలిటికల్ స్టార్లు..!

నామినేషన్ల పర్వం క్లైమాక్స్‌కు వచ్చింది. ప్రచారం స్పీడందుకుంది. ఇక జోరు పెంచాయి పార్టీలు. కాంగ్రెస్ తరఫున ఆ ముగ్గురు మంత్రులు..కారు పార్టీ నుంచి ఆ ఇద్దరు అన్నీ తామై జోరు పెంచారు. బీజేపీ అభ్యర్థి ప్రచారం ఇప్పుడిప్పుడే ట్రాక్ ఎక్కుతోంది. ఇక ఆ ముగ్గురు ముఖ్యనేతలు జూబ్లీహిల్స్ ప్రచార బరిలోకి దిగబోతున్నారట. బై ఎలక్షన్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న మూడు ప్రధాన పార్టీలు అగ్రనేతలు.. సభలు, రోడ్‌షోలతో హోరెత్తించబోతున్నారట. ఇంతకు ఏ పార్టీ నుంచి ఏ కీలక నేత రంగంలోకి దిగబోతున్నారు? తెలంగాణలో జూబ్లీహిల్స్ ఉపఎన్నిక రాజకీయం రసవత్తరంగా సాగుతోంది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ..బై ఎలక్షన్‌లో గెలిచేందుకు అన్ని అవకాశాలను వాడుకునే ప్లాన్ చేస్తున్నాయి. సిట్టింగ్ సీటును గెలిచి తీరాలన్న పట్టుదలతో బీఆర్ఎస్..ఈ ఎన్నికలో విజయం ద్వారా ప్రజలు మద్దతు ఉందని చెప్పుకునే ప్రయత్నంలో కాంగ్రెస్..బస్తీమే సవాల్ అంటున్నాయి. జూబ్లీహిల్స్ బైఎలక్షన్‌ను సీరియస్‌గా తీసుకున్న సీఎం రేవంత్ ఇప్పటికే ముగ్గురు మంత్రులకు బాధ్యతలు ఇచ్చారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, తుమ్మల నాగేశ్వరావులు జూబ్లీహిల్స్‌లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. అయితే బైపోల్ ఇంచార్జీలుగా ఉన్న ఆ ముగ్గురు మంత్రుల పనితీరుపై సీఎం రేవంత్ సంతృప్తిగా లేరట. ఇక లాభం లేదని తానే స్వయంగా రంగంలోకి దిగాలనుకుంటున్నారట. తాను ఎక్స్‌పెక్ట్ చేసిన రేంజ్‌లో మంత్రులు దూసుకుపోవడం లేదని..ప్రచారంలో మంత్రులు చేస్తున్న వ్యాఖ్యలు కూడా ఇబ్బందికరంగా మారాయని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారట.

**మంత్రులను నమ్ముకుంటే అయ్యేలా లేదన్న భావన..!** బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత తన భర్త మాగంటి గోపీనాథ్‌ను తలుచుకుని కన్నీళ్లు పెట్టుకోవడంపై మంత్రులు తుమ్మల, పొన్నం చేసిన వ్యాఖ్యలు జనంలోకి తప్పుడు సంకేతాలు వెళ్లేలా ఉన్నాయని అనుకుంటున్నారట. మంత్రుల కామెంట్స్ మహిళా ఓటర్లను ప్రభావితం చేస్తాయని, ఆ వ్యాఖ్యలు పరోక్షంగా బీఆర్ఎస్ అభ్యర్థికే మేలు చేసేలా ఉన్నాయని రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారట. ఇక జూబ్లీహిల్స్‌లో పెద్దఎత్తున నకిలీ ఓట్లను సృష్టించారని బీఆర్ఎస్ ఆరోపిస్తూ ఈసీకి ఫిర్యాదు చేసినా..మంత్రులు సమర్థవంతంగా తిప్పికొట్టలేకపోయారని రేవంత్ వాపోతున్నారట. ఈ క్రమంలో ఉప ఎన్నిక ఇంచార్జీలుగా ఉన్న మంత్రులను నమ్ముకుంటే అయ్యేలా లేదని..ఎన్నికలు అయిపోయే వరకు పూర్తిస్థాయిలో జూబ్లీహిల్స్‌పై కాన్సంట్రేట్ చేయాలని భావిస్తున్నారట సీఎం. ప్రచార సరళిని తానే మానిటరింగ్ చేయడంతో పాటు..మూడు, నాలుగు సభలకు ప్లాన్ చేసుకుంటున్నారట.

**బీఆర్ఎస్ పార్టీకి లైఫ్ అండ్ డెత్..** ఇక అందరికంటే ముందే జూబ్లీహిల్స్ అభ్యర్థిని ప్రకటించిన బీఆర్ఎస్ ప్రచారాన్ని హోరెత్తిస్తోంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రులు హరీశ్‌రావు, మల్లారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బస్తీలను చుట్టేస్తున్నారు. ఇప్పటికే రెండు మూడు సభలు పెట్టి గ్రాండ్ సక్సెస్ చేసిన కేటీఆర్.. డోర్ టు డోర్ క్యాంపెయిన్‌కు ఎక్కువ ప్రయారిటీ ఇస్తున్నారట. కాంగ్రెస్ బాకీ కార్డులను ప్రతీ ఓటరుకు చేర్చేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారట. అంతేకాదు గులాబీ బాస్ కేసీఆర్ కూడా ప్రచార బరిలోకి దిగబోతున్నారట. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో జూబ్లీహిల్స్‌లో గెలుపు అనివార్యమని..ఈ ఎన్నికే బీఆర్ఎస్ పార్టీకి లైఫ్ అండ్ డెత్‌గా భావిస్తోందట గులాబీ దళం. బైఎలక్షన్‌లో గెలవడం ద్వారా ప్రజలకు, కార్యకర్తలకు భవిష్యత్‌పై బలమైన ఆశలు కల్పించవచ్చని భావిస్తున్నారట కేసీఆర్ అండ్ కో. ఈ ఊపు అటు స్థానిక ఎన్నికల్లోనూ కొనసాగించవచ్చని అనుకుంటున్నారట. అందుకే బాస్ రంగంలోకి దిగితే అంతా సెట్ అవుతుందని లెక్కలు వేసుకుంటున్నారట లీడర్లు. అందుకు తగ్గట్లుగా కేసీఆర్ ప్రచారంలో పాల్గొనేలా షెడ్యూల్ ఖరారు చేస్తున్నారట. ఈ నెల 19న జూబ్లీహిల్స్‌లో భారీ రోడ్‌షోకు బీఆర్ఎస్ ప్లాన్ చేస్తోందట. ఆ రోడ్ షోతో పాటు మరో రెండు సభల్లో కేసీఆర్ పాల్గొనే అవకాశం ఉందట. ప్రచార గడువు లాస్ట్ డే రోజు కేసీఆర్ సభ ఉండేలా..లాస్ట్ రెండు మూడ్రోజులు ఓ వైపు డోర్ టు డోర్ క్యాంపెయిన్..ఇంకోవైపు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు సభలు ఉండేలా ప్లాన్ చేస్తున్నారట. ఇక జూబ్లీహిల్స్‌పై బీజేపీ కూడా సీరియస్‌గానే ఫోకస్ చేసింది. ఉప ఎన్నిక జరుగుతున్న జూబ్లీహిల్స్ సెగ్మెంట్..కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో ఉంటుంది. పైగా జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి కిషన్‌రెడ్డికి సన్నిహితుడు. ఎందరో ఆశావహులు టికెట్ కోసం లాబీయింగ్ చేసినా..కిషన్‌రెడ్డి పట్టుబట్టి దీపక్‌రెడ్డికి టికెట్ ఇప్పించారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కిషన్ రెడ్డి కూడా జూబ్లీహిల్స్ ప్రచార బరిలోకి దిగబోతున్నారట. ఆయన కూడా రోడ్‌షోలు, బహిరంగ సభలకు ప్లాన్ చేస్తున్నారని అంటున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల వాళ్లు ఉంటారు కాబట్టి..అవసరమైతే ఒకరిద్దరు జాతీయ స్థాయి బీజేపీ నేతలతో కూడా ప్రచారం చేయించే ఆలోచన చేస్తున్నారట. అలా మూడు ప్రధాన పార్టీల నుంచి ముగ్గురు బిగ్ పొలిటికల్ స్టార్లు రంగంలోకి దిగుతుండటంతో..ప్రచారం హోరెత్తడం ఖాయంగా కనిపిస్తోంది.

# సంపాదకీయం

## భారత్ తో కయ్యానికి పోయి.. అమెరికా చేతిలో పాక్ బలి?

భారత్‌ను వ్యూహాత్మకంగా దెబ్బతీయాలనే అహంకారపూరిత ప్రయత్నంలో పాకిస్తాన్ మరోసారి తన ఆర్థిక, రాజకీయ స్థిరత్వాన్ని పణంగా పెడుతున్నట్లు తాజా పరిణామాలు సూచిస్తున్నాయి. "కౌంటర్ పేరు చెప్పి కుంపటి పట్టుకున్న పాక్" అనే సామెతను నిజం చేస్తూ, గతంలో చైనా ట్రాప్‌లో చిక్కుకున్న పాక్ ఇప్పుడు అదే పొరపాటును అమెరికాతో పునరావృతం చేస్తోందనే విశ్లేషణలు బలంగా వినిపిస్తున్నాయి.

**కొత్త పోర్టు, కొత్త బానిసత్వం?...** ఇరాన్‌లో భారత్ నిర్మిస్తున్న చాబహార్ పోర్టు విజయవంతం కావడం ఖాయమని గ్రహించిన పాకిస్తాన్, దానికి ప్రత్యామ్నాయంగా, భారత్ వ్యూహాత్మక ప్రయోజనాలను అడ్డుకునే లక్ష్యంతో అమెరికాకు ఒక కీలకమైన డీల్‌ను ఆఫర్ చేసింది. పాకిస్తాన్‌లోని పాస్నీ ప్రాంతంలో అమెరికా పెట్టుబడులతో కొత్త పోర్టు నిర్మాణానికి పచ్చ జెండా ఊపినట్లు అంతర్జాతీయ వర్గాలు చెబుతున్నాయి. దీని వెనుక ప్రధాన లక్ష్యం.. చాబహార్ ద్వారా మధ్య ఆసియాకు భారత్ పొందుతున్న వ్యూహాత్మక ప్రవేశాన్ని అడ్డుకోవడం. కానీ, నిపుణులు హెచ్చరిస్తున్న ప్రకారం, ఇది కేవలం కౌంటర్ వ్యూహం కాదు, మరో శక్తివంతమైన దేశానికి పాకిస్తాన్ తన భూభాగాన్ని అప్పగించడమే అవుతుంది.

**చైనా గట్టిలోంచి అమెరికా ఉయ్యాలలోకి...** పాకిస్తాన్ ఇప్పటికే చైనా-పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్‌లో భాగంగా చైనా నిర్మించిన గ్వాదర్ పోర్టు ద్వారా చైనా ప్రభావంలోకి వెళ్లిపోయింది. భారీ రుణాలు, పెట్టుబడుల పేరుతో పాకిస్తాన్ చైనాకు దాదాపు అప్పుల బానిసగా మారింది. ఇప్పుడు అదే సమయంలో అమెరికాను మరో పోర్టు ప్రాజెక్టు పేరుతో ఆహ్వానించడం ఆందోళన కలిగిస్తోంది. విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం.. అమెరికా కూడా పోర్టు ప్రాజెక్టులో అడుగుపెడితే, పాకిస్తాన్ ప్రపంచంలోని రెండు అగ్ర రాజ్యాల మధ్య రాజకీయ బొమ్మగా మారిపోతుంది. ఈ రెండు శక్తుల మధ్య జరిగే పరోక్ష ఆధిపత్య పోరాటంలో పాక్ ఒక పావుగా మారి, తన స్వయం ప్రతిపత్తిని పూర్తిగా కోల్పోయే ప్రమాదం ఉంది. చైనా బంధనాల నుండి బయటపడకముందే అమెరికా ఉయ్యాల వైపు చూడటం దీర్ఘకాలిక వ్యూహం లేమికి నిదర్శనం.

**భారత్ వ్యూహానికి సవాలు అంతా సులభం కాదెందుకంటే...** భారత్ యొక్క చాబహార్ ప్రాజెక్టు మధ్య ఆసియా దేశాలతో వాణిజ్యాన్ని, వ్యూహాత్మక సంబంధాలను విస్తరించడంలో కీలకం. అమెరికా-పాకిస్తాన్ కొత్త ఒప్పందం నిజమైతే, అది చాబహార్ మీద పరోక్ష ఒత్తిడి సృష్టించవచ్చు. అయితే, పాకిస్తాన్ ఆర్థిక పరిస్థితిని, గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుంటే, అమెరికా సహకారం కూడా పాక్‌కు సులభంగా ఉపశమనాన్ని ఇవ్వదు.

**పాకిస్తాన్ ఎదుర్కొనే ప్రధాన ప్రమాదాలు...** చైనా అప్పుల భారం ఇప్పటికే మోయలేనిది. ఇప్పుడు అమెరికా పెట్టుబడులు కొత్త రుణ భారానికి దారితీయవచ్చు. ఒకేసారి చైనా , అమెరికా ప్రయోజనాలను సమతుల్యం చేసుకోవడం దాదాపు అసాధ్యం. ఇది పాక్ రాజకీయ నాయకత్వంపై తీవ్రమైన అంతర్గత, బాహ్య ఒత్తిడిని పెంచుతుంది. తాత్కాలిక రాజకీయ ప్రయోజనం కోసం ఏ దేశాన్ని ఆశ్రయించినా, స్పష్టమైన, దీర్ఘకాలిక జాతీయ వ్యూహం లేకపోతే "కౌంటర్" పేరుతో పాక్ తన తలనే పగలగొట్టుకోవడం తప్పదని అంతర్జాతీయ సంబంధాల నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఇది కేవలం భారత్‌కు కౌంటర్ కాదు, పాకిస్తాన్ భవిష్యత్తుకే కౌంటర్ అవుతుందని హెచ్చరిస్తున్నారు.

## పార్టీలకతీతంగా బిసి సంఘాలు చేపట్టనున్న తెలంగాణ బంద్ ను జయప్రదం చేయాలి : సి హెచ్ రమేశ్ గౌడ్



శామీర్ పేట, అక్టోబర్ 17 ( గరుడ వార్త) : పార్టీలకు అతీతంగా బిసి సంఘాలు చేపట్టిన తెలంగాణ బంద్ ను జయప్రదం చేయాలని తెలంగాణ బి.సి. కార్మిక సేవా సంఘం అధ్యక్షుడు సి హెచ్ రమేశ్ గౌడ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రం శామీర్ పేట లోని వైయస్సార్ చౌరస్తా వద్ద శనివారం ఉదయం తలపెట్టిన బందుకు పార్టీలకతీతంగా బిసి సంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలి వచ్చి బందులో పాల్గొన్నాలని కోరారు. ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ బిసి సంఘాలు చేపట్టిన తెలంగాణ బంద్ కు కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజేపి, సిపిఐ, ఎమ్మార్పీఎస్ తోపాటు అన్నీ రాజకీయ పార్టీలు మద్దతు తెలిపినట్లు చెప్పారు. 60 శాతాని కి పైగా ఉన్న బీసీలకు 42 శాతము ఇవ్వడం న్యాయమైన డిమాండన్నారు. కొద్ది మంది ఉన్న అగ్రకుల నాయకులు అడ్డుకోవడం చాలా భాదాకరమని విచారం వ్యక్తం చేశారు. గల్లీ నుంచి డిల్లీ వరకు సెగ పుట్టించాలని, 130 బిసి కుల సంఘాలు రాష్ట్ర బంద్ కు మద్దతు ఇస్తున్నారన్నారు. బిసి రిజర్వేషన్ వ్యతిరేకులను ఎండగట్టి తెలంగాణ రాష్ట్రంలో రాజ్యాంగ బద్ధ రిజర్వేషన్ సాధన కోసం ఈ బంద్ చేపట్టడం జరుగుతుందని తెలిపారు. బిసి రిజర్వేషన్లు పెంచడం తో రాష్ట్రం లో అన్నీ కులాలకు రాజకీయ ప్రాతినిధ్యం పెరుగుతుందని, అంతిమంగా రాజ్యాధికారంలో బిసి లకు 42 శాతం ప్రకారం వాటా దక్కుతుందని తెలిపారు. సుప్రీం కోర్టులో సానుకూల నిర్ణయం వచ్చేలా అడ్డంకులన్నిటిని అదిగమించే విదంగా, అవసరమైతే పార్లమెంటు లో చట్టం అయ్యేలా కాంగ్రెస్ ప్రభుత్వం తన వంతు పాత్ర పోషించాలని డిమాండ్ చేశారు. 42 శాతము రిజర్వేషన్ వచ్చేవరకు అన్నీ రాజకీయ పార్టీలు పోరాడాలని, బిసి లు అంటే అన్నీ రాష్ట్రాలకు భయం పుట్టే విధంగా పోరాటం చేయాలన్నారు. అన్నీ కుల సంఘాలు బందుకు మద్దతు ఇవ్వాలని, ఇది మన బిసి ల పోరాటమని చెప్పారు. పోరాటము తో సాధ్యము కానిది ఏమి లేదని, అందరూ ఈ బందుకు సహకారం అందించి విజయవంతం చేయాలని కోరారు.

## ఉత్కంఠగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా విలు విద్య పోటీలు

### పోటీల్లో సత్తా చాటిన హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ క్రీడాకారులు





శామీర్ పేట, అక్టోబర్ 17 ( గరుడ వార్త) : ఉత్సాహంగా, ఉత్కంఠగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా విలు విద్య పోటీలు జరిగాయి. తూంకుంట మున్సిపల్ పరిధిలోని స్పోర్ట్స్ స్కూల్లోఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్థాయి అండర్-14, 17 విభాగాల్లో విలు విద్య పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలకు మేడ్చల్, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల నుంచి 200 మంది విలు విద్య క్రీడాకారులు తరలివచ్చి తమ ప్రతిభను చాటుకున్నారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు వచ్చే నెలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ విలు విద్య కోచ్ డాక్టర్ రవిశంకర్ పేర్కొన్నారు.

**జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటిన హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు...**

హకీంపేట స్పోర్ట్స్ స్కూల్లో జరిగిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా విలు విద్య పోటీల్లో హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ కు చెందిన 18 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబర్చి పతకాలు, ప్రశంస పత్రాలు అందుకున్నారు. ఈపోటీల్లో అండర్-14, 17 విభాగాల్లో ఇండియన్ రౌండ్లో పి. హేమంత్, ఎం.సాత్విక్, చరణ్, దీక్షిత్, సంజయ్, జి ఝాన్సికా, సిహెచ్ రష్మీత, హిమజాగౌడ్, నేత్ర, సింధుజా, రీకర్వ్‌లో వశిష్ట సాయిప్రియ, లోహితశ్రీ, హారికా, కంపౌండ్ పోటీల్లో ఎస్ అన్విత, ఎం. శ్రీనిఖా, అక్షర, శివానీ పతకాలను సాధించారని విలు విద్య కోచ్ డాక్టర్ రవిశంకర్ వివరించారు.

## ప్రతి ఒక్కరు తడి పొడి చెత్తను వేరువేరుగా పోగు చేయాలి...



శామీర్ పేట, అక్టోబర్ 17( గరుడ వార్త ) : ప్రతి ఒక్కరు తడి పొడి చెత్తను వేరువేరుగా నిల్వచేసి వేయాలని మున్సిపల్ కమిషనర్ పవన్ కుమార్ తెలిపారు. శుక్రవారం మూడు చింతలపల్లి మున్సిపల్ పరిధిలోని అద్రాస్ పల్లి లో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ వారి సహకారంతో వార్డు కార్యాలయంలో తడి పొడి చెత్తసేకరణ బ్యాగ్ లు ఇంటింటికి పంపిణి చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఇళ్లలో తడి చెత్తను పొడి చెత్తను వేరువేరుగా వేసి అందజేయాలని సూచించారు.అనంతరం గ్రామంలో ప్రాథమిక పాఠశాల లో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ వారి సహకారంతో ఇంకుడు గుంత ఏర్పాటు చెయ్యగా పరిశీలించారు. గ్రామంలో సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కావాలని మున్సిపల్ కమిషనర్ కు గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఉష, శానిటేషన్ ఇన్స్పెక్టర్ మోహన్ సింగ్, గ్రామ మాజీ సర్పంచ్ బోయిని లలిత నర్సింలు, గ్రామస్తులు యాదగిరి, నాగేష్, సంజీవ, నరసింహ, మహిళ సంఘాల మహిళలు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

## బాల్యంపై వ్యాధుల ముసురు

హైదరాబాద్: గ్రేటర్‌లో వరుస వానలతో చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం కన్పిస్తోంది. వరద నీరు నిల్వ...ఇళ్లు మునిగిపోవడం వంటి ప్రాంతాల్లో పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ సంస్థ హకీంపేట్, టోలిచౌకి, రాజేంద్రనగర్, కిషన్‌బాగ్, కాలాపత్తర్, ఎర్రకుంట, షహీన్‌నగర్, పహాడిషరీఫ్, జల్‌పల్లి తదితర బస్తీల్లో రెండు నెలలుగా నిర్వహించిన పరీక్షల్లో ఈ విషయం తేలింది. మొత్తం 64,471 మంది చిన్నారులకు తమ క్లినిక్‌ల ద్వారా పరీక్షలు నిర్వహించారు. ఓపీకి వచ్చిన వారిలో దాదాపు 40 శాతం మంది శ్వాసకోశ, ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్లతో బాధపడుతున్నారు. బ్యాక్టీరియా, వైరస్ కారణంగా తలెత్తే న్యుమోనియా, బ్రాంకైటీస్‌తో ఎక్కువ మంది బాధపడుతున్నారు. చాలామంది దగ్గు, జ్వరం, ఛాతీలో అసౌకర్యం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా 300 మంది టైఫాయిడ్ బారిన పడినట్లు పరీక్షల్లో తేలింది. వానలతో నీరు, ఆహారం కలుషితమవడమే ఇందుకు కారణం. చాలా బస్తీల్లో వాన నీరు నిల్వతో దోమలు వృద్ధి చెంది డెంగీ బారిన పడుతున్నారు. చాలామంది చిన్నారులను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు చికిత్స అందించామని, పరిస్థితి తీవ్రతను బట్టి కొందరిని నిలోఫర్‌కు పంపినట్లు హెచ్‌హెచ్‌ఎఫ్ ప్రతినిధులు తెలిపారు.

ఏ వయస్సు వారు ఎంతమంది
5 ఏళ్లలోపు 40 శాతం



5-10 ఏళ్లు 24 శాతం
10-14 ఏళ్లలోపు 36 శాతం
పిల్లల్లో తీవ్రమైన వ్యాధుల శాతం ఇలా...
న్యూమోనియా, బ్రాంకైటీస్ 40 శాతం
కండ్లకలక 3.5 శాతం
దంతాల్లో ఇబ్బందులు 4 శాతం
చిన్న గాయాలు 11 శాతం
టైఫాయిడ్ 300 మంది

## పేరు గొప్ప.. భద్రత డొల్ల

చర్లపల్లి : చర్లపల్లి రైల్వేస్టేషన్‌నురూ.430 కోట్లతో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించినా.. కీలకమైన భద్రతా వ్యవస్థను మాత్రం విస్మరించారు. ఈ స్టేషన్ నేరగాళ్లకు నిలయంగా, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ దృష్ట్యా ప్రస్తుతం రైళ్లన్నీ చర్లపల్లి నుంచే వెళ్తున్నాయి. రోజూ 60-70 రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. 30-40వేల మంది తమ గమ్యస్థానాలకు చేరుతున్నారు.

స్టేషన్‌కు 2 ప్రధాన ద్వారాలున్నాయి. ఒకటి దక్షిణం వైపు (కొత్తగా నిర్మించారు), మరొకటి ఉత్తరం వైపు. దక్షిణంవైపు ఎలాంటి తనిఖీలు లేవు. స్కానర్లున్నా.. కొందరు వాటిగుండా వెళ్లడం లేదు. స్కానర్ల అలారం మోగినా పట్టించుకునే వారే లేరు. ఉత్తరం వైపు తనిఖీలు లేకపోగా స్కానర్లు ఏర్పాటు చేయలేదు. ప్రవేశ ద్వారం నిర్మించలేదు. ఎవరైనా రావొచ్చు.. ఎవరైనా పోవచ్చున్నట్లుగా మారింది.

**సిబ్బంది కొరత..** టెర్మినల్‌లో 120 మంది ఆర్‌పీఎఫ్, జీఆర్‌ఎఫ్



సిబ్బంది అవసరం కాగా 20 మందే ఉన్నారు. వీరే చర్లపల్లితో పాటు మౌలాలి, ఘట్‌కేసర్ స్టేషన్లను పర్యవేక్షించాలి. గతేడాది దక్షిణ మధ్య రైల్వే ఇన్స్‌పెక్టర్ జనరల్(ఐజీ), ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమా సింగ్ ఠాకూర్ స్టేషన్ పరిశీలనకు రాగా సమస్యను వివరించారు. త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా.. కార్యరూపం దాల్చలేదు.

**నేరాలకు అడ్డా..**

చర్లపల్లిలో భద్రత లేకపోవడంతో నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. యూపీ, మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల నుంచి భారీగా గంజాయి నగరానికి సరఫరా అవుతోంది. వివిధ ప్రాంతాల నుంచి బాల కార్మికులు సైతం పెద్దఎత్తున నగరంలోకి ప్రవేశిస్తున్నారు. గత నెలలో బిహార్ ముఠా తుపాకులు అమ్ముతూ రైల్వే స్టేషన్ పరిసరాల్లో పట్టుబడింది. తాజాగా ఒకరు మహిళను హత్యచేసి మృతదేహాన్ని చర్లపల్లి స్టేషన్‌కు తీసుకొచ్చాడు. 2గంటలు స్టేషన్ ఉత్తర ముఖద్వారం వద్ద తాపీగా కూర్చుని రైలెక్కి వెళ్లిపోయాడు.

టెర్మినల్ స్వరూపం
ప్రధాన ద్వారాలు: 02
ప్లాట్‌ఫాంలు: 09
స్కానర్లు: కేవలం 02

## అలసి'పోతున్న' వలస జీవులు

మేడిపల్లి : కోరుట్లకు చెందిన శ్రీరాముల శ్రీధర్(46) సౌదీ అరేబియా నుంచి ఇటీవల కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి ఇంటికి వస్తున్నానని చెప్పారు. అతడి కోసం ఎదురుచూస్తున్న క్రమంలో విమానంలోనే గుండెపోటుతో కన్నుమూశారని తెలిసి భార్య, ఇద్దరు కూతుళ్లు కన్నీరుమున్నీరుగా రోదించారు.గల్ఫ్ దేశాలైన యూఏఈ, సౌదీ అరేబియా, బహ్రెయిన్, కువైట్, ఒమన్, ఖతర్, ఇరాక్ దేశాల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన సుమారు 3.50 లక్షల మంది ఉన్నారు. ఇందులో వివిధ వ్యాధుల బారిన పడుతున్న వారి సంఖ్య 57 శాతానికి పైగా ఉంటుందని సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్(సెస్) సర్వేలో తేలింది. సంస్థకు చెందిన సహాయ అధ్యాపకుడు విజయ్ కొర్రా ఆధ్వర్యంలో రాష్ట్రంలోని పలు గ్రామాలు, యూఏఈలోని కంపెనీల్లో గల్ఫ్ కార్మికుల ఆరోగ్య స్థితిగతులపై సర్వే నిర్వహించారు. తాము అనారోగ్యంతో బాధ పడుతున్నామని జగిత్యాల జిల్లాకు చెందిన 11.4 శాతం మంది వెల్లడించారు. అదే స్థాయిలో రాజన్న సిరిసిల్ల జిల్లా వలసజీవులుంటారని అంచనా.

**చికిత్స తీసుకోలేక.. ఇంటికి రాలేక!**

ఆర్థిక పరిస్థితులు అనుకూలించక గల్ఫ్ వెళ్తున్న కార్మికులు ఒంటరి జీవితంతో మానసికంగా కుంగిపోతున్నారు. కంపెనీ యాజమాన్యాలు ఆరోగ్య బీమా లాంటివి వర్తింపజేయక, ప్రైవేటు వైద్యానికి నోచుకోలేక, వ్యాధుల బారిన పడినా అక్కడే ఉండిపోతున్నారు. అనారోగ్య బాధితుల్లో 90 శాతానికి పైగా చికిత్సకు నోచుకోవడం లేదని సర్వేలు చెబుతున్నాయి. అక్కడే మందులు కొనుక్కోవడం, లేదంటే స్వదేశం నుంచి వచ్చేవారితో తెప్పించుకోవడం పరిపాటిగా మారింది.

బోయినపల్లి మండలం రత్నంపేటకు చెందిన ఎదురుగట్ల నాగరాజు దుబాయిలో ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ పక్షవాతానికి గురయ్యారు. కంపెనీ తరఫున ఆసుపత్రిలో చేర్పించి శస్త్రచికిత్స చేయించారు. పక్షవాతానికి గురైన నాగరాజు కుటుంబ సభ్యుల సమక్షంలో త్వరగా కోలుకుంటారని కంపెనీ వారు స్వగ్రామానికి పంపారు. దుబాయిలోని ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ వారు నాగరాజు కుటుంబానికి గత నెలలో రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. మల్లాపూర్ మండలానికి చెందిన పోపుల నరేశ్(23) ఉపాధి కోసం



బహ్రెయిన్ వెళ్లారు. మే నెలలో తీవ్ర అనారోగ్యంతో అక్కడే మృత్యువాత పడటం కుటుంబ సభ్యులకు తీరని శోకం మిగిల్చింది.

**మృతుల్లో ఉమ్మడి జిల్లావాసులే అధికం**

గల్ఫ్ దేశాల్లో భవన నిర్మాణ రంగంలో 48 డిగ్రీలకు పైగా ఎండలో పని చేస్తూ కార్మికులు డీ హైడ్రేషన్‌కు గురవుతున్నారు.చర్మ, శ్వాస సంబంధిత, వెన్ను, కీళ్ల నొప్పులు, రక్తపోటు, మూత్రపిండ వ్యాధి బాధితుల సంఖ్య పెరుగుతోంది.అధిక రక్తపోటుతో పక్షవాతం బారిన పడుతున్నారు. గతేడాది రాష్ట్రానికి చెందిన 20 మంది గల్ఫ్‌లో బ్రెయిన్ డెడ్ అయినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.2023 డిసెంబరు 7 తర్వాత మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.5 లక్షల చొప్పున అందిస్తోంది.ఈ ఏడాది మార్చి వరకు రాష్ట్రానికి చెందిన 169 మంది మృతి చెందినట్లు గుర్తించగా అందులో 70 మందికి పైగా ఉమ్మడి జిల్లావాసులే. మొత్తం మృతుల్లో 50 శాతం అనారోగ్య బాధితులేనని తెలుస్తోంది.

**ఆరోగ్యపరమైన జాగ్రత్తలతోనే క్షేమం**

గల్ఫ్ వెళ్లిన వారు మాంసాహారం ఎక్కువ తీసుకుంటారు. దాన్ని తగ్గించి క్రమబద్ధమైన ఆహారం తీసుకోవాలి. స్వదేశానికి వచ్చినప్పుడు, అక్కడ ఉన్నప్పుడు పరీక్షలు చేయించుకొని మందులు వాడాలి. గల్ఫ్ దేశాల్లో మధుమేహం, పక్షవాతం, డీహైడ్రేషన్ కేసులు పెరుగుతున్నాయి. మానసిక ఒత్తిడి తగ్గించుకొని ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తీసుకుంటే ఇబ్బందులుండవు.డాక్టర్ వేణుబాబు, ఫిజీషియన్, జగిత్యాల

# యాసంగి సాగు ప్రణాళిక సిద్ధం

గరిడేపల్లి : యాసంగి సీజన్‌లో పంటల సాగు సంబంధించిన ప్రణాళికను వ్యవసాయ శాఖ సిద్ధం చేసింది. ఏ పంటలు ఎంత విస్తీర్ణంలో సాగుచేస్తారో అంచనా వేసింది. గతేఏడాది యాసంగిలో అంచనాలు, అనంతరం సాగును పరిగణనలోకి తీసుకోవడంతోపాటు వానాకాలం పంటల స్థితిని మేళవించి ప్రణాళిక రూపొందించారు. వానాకాలం పత్తి, మిరప సాగు అలాగే ఉంటుంది. కొత్తగా వేయరు.

**అనుకూల వాతావరణం..**

సూర్యాపేట జిల్లాలో సాగర్, మూసీ, ఎస్సారెస్పీ కింద, విద్యుత్తు మోటార్ల సాయంతో వరి సాగు ఎక్కువగా చేయనున్నట్లు అధికారుల అంచనా. ఆయకట్టేతర ప్రాంతాలలో వేరుశనగ, కూరగాయలు, జొన్న, పెసర, బొబ్బర వంటివి సాగుచేస్తారు. కాల్వల కింద ఉండే భూముల్లో వంద శాతం వరి సాగవుతుంది. వానాకాలంలో అంచనాలకు మించి పంటల సాగయ్యాయని అధికారులు పేర్కొంటున్నారు. వర్షాలు ముందుగానే రావడం, జలాశయాలు సైతం నిండి కాల్వలకు నీరు వదలడం వంటి అనుకూల వాతావరణం నెలకొంది. అక్టోబరు మొదటి వారంలోనే యాసంగి ప్రణాళిక సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపాలి. తదనుగుణంగా ఎరువులు, విత్తనాలు, ఇతర సాగు వనరులపై తగిన



సమయంలో చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఇటీవల యూరియా కొరతతో రైతుల్లో తీవ్ర ఆందోళన, ఆగ్రహం వ్యక్తమైంది. అందుకే ముందస్తుగా అంచనా రూపొందించి ఎరువులు అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. యాసంగికి సాగునీటి వనరులు పుష్కలంగా ఉన్నాయి. నేటికీ భారీ వర్షాలు పడుతుండటంతో బావులు, చెరువులు నిండుకుండల్లా మారాయి. జలాశయాలకు వరద కొనసాగుతూనే ఉంది. అంటే యాసంగి పంట చేతికి వచ్చే వరకు (ఏప్రిల్ చివరి వరకు)నీటికి ఢోకా లేదు. ఈసారి వరి ఎక్కువ సాగు కానుంది.

# ముందుకొస్తే.. ముమ్ముందు మరింత లబ్ధి!

ఖమ్మం : 'సౌర విద్యుదుత్పత్తికి గృహ విద్యుత్తు వినియోగదారులు ప్రయత్నించాలి. ప్లాంట్ ఏర్పాటైన పక్షం రోజుల్లోనే రాయితీ అందుతుంది. దీర్ఘకాలిక ప్రయోజనం పొందవచ్చు' అని టీజీ రెడ్కో మేనేజర్ అజయ్‌కుమార్‌కు తెలిపారు. పర్యావరణానికి హాని కలగకుండా సౌర వెలుగులతో తక్కువ ఖర్చుతో విద్యుత్తును ఉత్పత్తి చేయవచ్చు ప్రతి ఇంటా వారి అవసరాలకు ఉపయోగపడేలా సౌర విద్యుదుత్పత్తిని ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలు అందిస్తున్నాయి. ప్రజలను చైతన్యపరిచేందుకు 'ఆదర్శ సౌర గ్రామం(మోడల్ సోలార్ విలేజ్)', 'ఆదర్శ సౌర మండలం' పథకాలకు శ్రీకారం చుట్టాయి. ఆదర్శ సౌర గ్రామాలు, మండలాల్లో 100% రాయితీలు ఇస్తూ సోలార్ విద్యుదుత్పత్తికి ఊతమిస్తున్నాయి. సాధారణ రాయితీలు వర్తిస్తుండటంతో ఇతర గ్రామాల్లో సౌర విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటుకు వినియోగదారులు ఆసక్తి చూపట్లేదు.

**ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో..**

ఖమ్మం జిల్లాలో మధిర మండలం సిరిపురం, రఘునాథపాలెం మండల కేంద్రం, నేలకొండపల్లి మండలం చెరువుమాధారం, వైరా మండలం స్నానాల లక్ష్మీపురం, ఏన్కూరు మండలం శ్రీరామగిరిని ఆదర్శ సౌర గ్రామాలుగా ఎంపికయ్యాయి. ఈ ఐదు గ్రామాల్లో 4,631 గృహ, 1,533 వ్యవసాయ విద్యుత్తు సర్వీసులు ఉన్నాయి. ఆదర్శ సౌర మండలం బోనకల్లులో.. 22 గ్రామాల్లోని 12,206 గృహ, 2,838 వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లకు సౌర ఫలకాల ఏర్పాటుకు 100% రాయితీ వర్తిస్తుంది. భద్రాద్రి జిల్లాలో దమ్మపేట మండలం గండుగులపల్లి ఆదర్శ సౌర గ్రామంగా ఎంపికైంది. ఈ ఊరులో 589 గృహ, 298 వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి.

**రాయితీలు ఇలా..**

ఉభయ జిల్లాల్లోని ఇతర గ్రామాల్లో గృహ, వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు కలిగిన వినియోగదారులకు సాధారణ రాయితీ వర్తిస్తుంది. 3కిలోవాట్ల సోలార్ విద్యుత్తు ప్లాంట్ ఏర్పాటుకు రూ.2.10-2.25లక్షలు ఖర్చవుతుంది. వ్యవసాయ విద్యుత్తు మోటార్లకు 7.5కిలోవాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంట్ ఏర్పాటుకు రూ.4-4.50లక్షలు వెచ్చించాలి. కేంద్ర పథకంలో ఒక కిలోవాట్‌కు రూ.30వేలు, 2కిలోవాట్లకు రూ.60వేలు, 3కిలోవాట్లు ఆపైన వాటికి రూ.78వేలు రాయితీ అందుతుంది. రాష్ట్ర పథకంలో 2కిలోవాట్ల వరకు ఉచితం. 3కిలోవాట్ల సౌరఫలకాలతో చలికాలంలో నెలకు సుమారు 300 యూనిట్లు, వేసవిలో 400 యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి చేయవచ్చు గృహస్థులు తమ అవసరాలకు వినియోగించుకోగా మిగిలిన విద్యుత్తును డిస్కమ్ కొంటుంది. యూనిట్‌కు రూ.5.25 చొప్పున చెల్లిస్తుంది. ఉభయ జిల్లాల్లో సుమారు 4.96లక్షల గృహ, 1.20లక్షల వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. ఎంపికైన ఆదర్శ గ్రామాల్లో మినహా మిగిలిన పల్లెలు, పట్టణాల్లో సౌర విద్యుదుత్పత్తికి ఎవరూ ముందుకు రావట్లేదు. 80శాతం గృహ విద్యుత్తు కనెక్షన్లకు రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న గృహజ్యోతి పథకం ద్వారా నెలకు 200 యూనిట్ల విద్యుత్తు ఉచితంగా అందుతుండమే దీనికి కారణమని అధికారులు చెబుతున్నారు.

# బిల్లులు.. ఇక ఆన్‌లైన్ చెల్లింపులు

సూర్యాపేట : బాలికలకు విద్య, వసతి, భోజనంతో పాటు వృత్తిపరమైన శిక్షణ అందించి వారి భవిష్యత్తుకు కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు(కేజీబీవీ) బాటలు వేస్తున్నాయి. వీటిలో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యనభ్యసించవచ్చు. కేజీబీవీల నిర్వహణకు మాన్యువల్ వ్యవస్థను తొలగించి అన్ని రకాల బిల్లులను ఆన్‌లైన్‌లో చెల్లించనున్నట్లు ప్రభుత్వం తాజాగా ప్రకటించింది. కేజీబీవీల్లోని స్పెషల్ ఆఫీసర్(ఎస్వో) బిల్లులను డీఈవోలకు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా సమర్పించాల్సి ఉంటుంది. దీంతో డీఈవో బడ్జెట్ విడుదల చేస్తారు. ఇప్పటి వరకు నెల వారీగా బిల్లులు చెల్లించకపోవడంతో ఎస్వోలు అప్పులు చేసి విద్యాలయాలను నెట్టుకొచ్చేవారు. తద్వారా విద్యార్థినులకు అరకొర పౌష్టికాహారం అందుతుందనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు ప్రతినెల బిల్లులు ఆన్‌లైన్‌లో చెల్లించేలా సర్కారు నిర్ణయించింది. విద్యార్థినులకు మేలు: జిల్లాలోని 18 కేజీబీవీల్లో 3,995 విద్యార్థులు చదువుతున్నారు. ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లించే విధానం ద్వారా విద్యార్థినులకు డైట్, నాన్ డైట్ బిల్లులు, ప్రధానంగా కాస్మెటిక్ ఛార్జీలు సకాలంలో అందుతాయి. పాలు, కూరగాయల బిల్లులు ప్రతినెలా గుత్తేదారుల ఖాతాల్లో జమవుతాయి. ఫలితంగా పౌష్టికాహారంలో నాణ్యత పెరుగుతుంది. ఇప్పటికే ఈ విధానం పీఎంశ్రీ పాఠశాలల్లో విజయవంతం గా అమలవుతోంది. జిల్లా స్థాయి అధికారులతో పాటు కేజీబీవీల సిబ్బందికి ఆన్‌లైన్ విధానంలో చెల్లింపుపై శిక్షణ ఇవ్వనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

# రోడ్లు ధ్వంసం.. ఇసుక తవ్వకాలతో విధ్వంసం



కరీంనగర్ : మానకొండూర్ మండలం ఊటూరు సమీపంలో మానేరు నది నుంచి మళ్లీ ఇసుక తవ్వకాలు అధికారికంగా ప్రారంభమయ్యాయి. గడిచిన కొన్ని నెలలుగా మూసి వేసిన రీచ్‌ను ఇటీవల తెరిచారు. సమృద్ధిగా ఇసుక ఉన్న ఇక్కడి ప్రాంతంలో గతంలో మూడు రీచ్‌లను టీజీఎండీసీ (తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ) పర్యవేక్షణలో ఏర్పాటు చేశారు. ఇక్కడ ఇసుక తవ్వకాలు, తరలింపు విషయంలో ఇష్టారాజ్యమనే పంథా కొనసాగిందనే విమర్శలున్నాయి. గుత్తేదారులు స్థానికంగా ఉన్న రాజకీయ పెద్దల అండతో అడ్డూ అదుపులేకుండా సహజ సంపదను కొల్లగొట్టారనే ఆరోపణలున్నాయి. అధికార పార్టీకి చెందిన పెద్ద నాయకుడి సహకారంతో నిబంధనలు అతిక్రమిస్తూ అధిక ఇసుకను లారీల్లో నింపారనే ఫిర్యాదులున్నాయి.

**దుమ్మూ.. ధూళి..**

ఊటూరులో ఇసుక రీచ్‌ల వద్దకు వచ్చే వందలాది వాహనాలతో మానకొండూర్ మండలంలోని పలు గ్రామాలకు అనుసంధానంగా ఉన్న రోడ్లు దెబ్బతింటున్నాయి. ఇప్పటికే ఛిద్రమైన దారులతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా వరుసగా వస్తున్న లారీలతో ఆయా గ్రామాల ప్రజలను దుమ్మూ ధూళితో ఇబ్బందులు పడుతున్నారు. మానకొండూర్-జమ్మికుంట మార్గంలో కొన్ని నెలల కిందట వేసిన తారు రోడ్డు అన్నారం, లలితాపూర్, రంగపేట, పోచంపల్లి, పచ్చునూర్ గ్రామాల చెంతన పూర్తిగా పాడైపోయింది. నిర్ణీత పరిమాణాన్ని మించి అధిక లోడుతో ఇసుక వెళ్తుండటంతో దారులు దెబ్బతింటున్నాయి. 20 టన్నులు తీసుకెళ్లాల్సిన లారీల్లో 25-30 టన్నులను వేస్తూ తీసుకెళ్తుండటంతో రోడ్లు రూపును కోల్పోతున్నాయి. ఊళ్లలోని జనావాసాల మధ్య నుంచే లారీలు వెళ్తుండటంతో దుమ్ముతో ప్రజల ఆరోగ్యానికి ఆపద పొంచి ఉంది. అతి వేగంగా నడుపుతుండటంతో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు.

**పట్టని నిబంధనలు..**

ఊటూరులో మూడు బ్లాక్‌లకుగాను ప్రస్తుతం రెండే నడుస్తున్నాయి. ఒక బ్లాక్‌లో 5,928 క్యూబిక్ మీటర్ల ఇసుక మాత్రమే అందుబాటులో ఉంది. మరో రెండు చోట్ల కలిపి 1,53,920 క్యూ.మీ తవ్వకానికి అనువుగా ఉంది. వీటి చెంతన సీసీ కెమెరాల నిఘాను అన్ని వైపులా ఏర్పాటు చేయలేదు. లారీలో 2,3 జేసీబీ బకెట్లను అదనంగా పోస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారు. రవాణా శాఖ అధికారులు దారి మధ్యలో వాహన తనిఖీలు చేపట్టడం లేదు. వే బ్రిడ్జి వద్ద పక్కాగా తూకం వేయాలి. కానీ పట్టించుకునే వారు కరవయ్యారు. నిర్ణీత పరిధిని మించి తవ్వకాలు చేస్తూ గుత్తేదారులు సొమ్ము చేసుకుంటున్నారు.

# అసలు కొలతల పుస్తకం ఎక్కడ?



కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని కిసాన్ నగర్ సమీకృత మార్కెట్ అభివృద్ధి పనులకు సంబంధించి మాయమైన కొలతల పుస్తకం(ఎంబీ) జిరాక్స్ ప్రతులు దొరికినట్లుగా ప్రచారం జరుగుతోంది. రెండేళ్లుగా ఈ ఎంబీపై రగడ జరుగుతుండగా అడుగు ముందుకు పడటంలేదు. ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. రూ.4.80 కోట్లతో సమీకృత మార్కెట్ నిర్మించేందుకు అప్పటి అధికారులు అంచనాలు తయారు చేశారు. పనులు చేస్తుండగా అంచనాలకు మించి రికార్డు చేసి, నిధుల దుర్వినియోగంతోపాటు అక్రమాలు జరిగాయని మాజీ కార్పొరేటర్లు కమిషనర్ నుంచి రాష్ట్ర స్థాయి అధికారుల వరకు ఫిర్యాదులు చేశారు.

ఎంబీ పుస్తకం దొరకకపోవడం, నిర్లక్ష్యం వహించిన సంబంధిత ఏఈ గఫూర్‌ను ఇటీవల సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. మరో వైపు రెండు నెలల కిందట బల్దియా కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ దీనిపై కమిటీ వేశారు. కమిటీ ఆరా తీస్తుండటం, లెక్కలు తారుమారు అయ్యే అవకాశముందనే కారణాలతో జిరాక్స్ ఎంబీ బయటకు వచ్చినట్లు తెలుస్తోంది. క్వాలిటీ కంట్రోల్(క్యూసీ) దగ్గర జిరాక్స్ పత్రాలు దొరికాయని అంటున్నారని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. అయితే ప్రతీ ఎంబీ పుస్తకం నకలు కాపీలు క్యూసీ దగ్గర లభిస్తాయనే నమ్మకం ఉండదు. అలాంటప్పుడు ఇదెక్కడి నుంచి వచ్చిందో తెలియడంలేదు.

**రెండింటిని పోల్చేందుకు చర్యలు**

సమీకృత మార్కెట్‌కు సంబంధించిన అసలు ఎంబీ దొరకకపోగా జిరాక్స్ ప్రతులలో ఉన్న కొలతలకు బల్దియా వద్ద వివరాలకు పోల్చేందుకు నిర్ణయించినట్లు సమాచారం. రెండింటిలో ఉన్న కొలతలు సమానంగా ఉంటే ఆ ఎంబీపై నమ్మకం కుదురుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ కొలతలను సస్పెండ్ అయిన ఏఈతోనే చేపట్టాల్సి ఉండగా ఆయన వచ్చేందుకు మొగ్గు చూపడంలేదని తెలిసింది.

**నివేదికలో జాప్యం**

మార్కెట్ నిర్మాణ పనులపై కొలతలు తేల్చేందుకు కమిటీ అధికారులు రెండు నెలలుగా విచారణ చేస్తున్నారు. కొలతల పుస్తకం లేకపోవడంతో కొలతలు సరిగ్గా నమోదు చేశారా? లేదా? రన్నింగ్ బిల్లు ఓచర్‌తోపాటు సీసీ ఫామ్‌లో వివరాలను పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిసింది. దీని ఆధారంగా క్షేత్రస్థాయిలో చేపట్టిన అంచనా పనికి, వాస్తవంగా జరిగిన బిల్లులో ఉన్న రికార్డు కొలతల తనిఖీ చేయాల్సి ఉంటుంది. నియమించిన ఇంజినీరింగ్ అధికారుల కమిటీ బృందం విచారణ చేపట్టి, నివేదిక అందించడంలో జాప్యం చేస్తున్నట్లు కనిపిస్తోంది.

# వైద్య విద్యకు వేళాయే!




గోదావరిఖని : గోదావరిఖనిలోని ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణం పూర్తయి విద్యార్థులకు అందుబాటులోకి వచ్చింది. ప్రభుత్వం మొదటగా ప్రకటించిన వైద్య కళాశాలల్లో గోదావరిఖని లేకపోగా.. అనంతరం మంజూరిచ్చారు. దీంతో భవన నిర్మాణ పనులు ఆలస్యంగా మొదలైనప్పటికి త్వరితగతిన వసతి సదుపాయాలను అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో ప్రభుత్వం, సింగరేణి ప్రోత్సాహంతో సంబంధిత గుత్తేదారు పనులను వేగవంతం చేశారు.

**సింగరేణి సహకారంతో ముందడుగు**

కళాశాల ఏర్పాటుకు అవసరమైన స్థలంతోపాటు భవన నిర్మాణానికి అవసరమైన నిధులను సింగరేణి యాజమాన్యమే కేటాయించింది. గుత్తేదారుకు బిల్లుల చెల్లింపులో ఎలాంటి జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు చెల్లిస్తుండటంతో అంతే వేగంగా గుత్తేదారు పనులు చేపట్టారు. దంతవైద్య విభాగం(డెంటల్ కళాశాల) ఏర్పాటుకు సమాలోచనలు చేస్తున్నారు. నర్సింగ్, పారామెడికల్ కళాశాలలు మంజూరుకాగా తరగతులు కొనసాగుతున్నాయి. నర్సింగ్ కళాశాల భవన నిర్మాణానికి సైతం సింగరేణి స్థలం కేటాయించగా ప్రభుత్వ నిధులతో పనులు కొనసాగుతున్నాయి. తాత్కాలికంగా నర్సింగ్ విద్యార్థుల వసతికి సింగరేణి అతిథి గృహాలను కేటాయించారు.

**రూ.510 కోట్లు కేటాయింపు**

వైద్య కళాశాల కోసం సింగరేణి యాజమాన్యం 21 ఎకరాల స్థలాన్ని అప్పగించడంతోపాటు భవనాల నిర్మాణానికి రూ.510 కోట్లు కేటాయించింది. వైద్య కళాశాలకు అవసరమైన అకడమిక్ బ్లాకులు, వసతి గృహాలు ఇతర భవనాల నిర్మాణాలకు సుమారుగా రూ.370 కోట్లు ఖర్చుకాగా.. మిగతా నిధులతో ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఐదంతస్తుల్లో విశాలమైన భవన నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. వైద్య విద్య పీజీ విద్యార్థులకు తరగతి, వసతి గదుల నిర్మాణాలు సైతం పూర్తయ్యాయి.

**16 నెలల్లోనే పూర్తి**

జాతీయ వైద్య కమిషన్ నిబంధనల ప్రకారం బోధనాసుపత్రిలో పడకలు, తరగతుల నిర్వహణకు భవనాన్ని ముందుగానే సమకూర్చాల్సి ఉండగా.. సింగరేణి ఆసుపత్రిలోని పడకలను బోధనాసుపత్రికి, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తాత్కాలిక తరగతుల నిర్వహణకు కేటాయించారు. డిగ్రీ కళాశాలలో వైద్య విద్య తరగతులు నిర్వహించవద్దంటూ విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టాయి. దీంతో ఆరు నెలల్లోనే మొదటి అకడమిక్ బ్లాక్ నిర్మాణం పూర్తిచేశారు. మరో రెండు అకడమిక్ బ్లాకులతోపాటు వైద్య విద్యార్థులు, ఆచార్యులకు వసతి గృహాలు, క్యాంటీన్, అతిథి గృహం తదితర భవన నిర్మాణాలు కేవలం 16 నెలల్లోనే పూర్తయ్యాయి.

# సన్నాలకు 292.. దొడ్డు రకాలకు 34

ఖమ్మం: వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు రంగం సిద్ధమైంది. దీపావళి పండుగ అనంతరం ఈనెల 25 నుంచి సత్తుపల్లి నియోజకవర్గంలోని కల్లూరు మండలంలో మొదట ఆరంభించనున్నారు. మిగతా ప్రాంతాల్లో వరికోతల ఆధారంగా ఏర్పాటుచేస్తారు. జిల్లావ్యాప్తంగా 326 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

**కల్లూరులో మొదలైన వరికోతలు**

కల్లూరు మండలంలో ఇప్పటికే వరికోతలు మొదలయ్యాయి. బురద పొలాల్లోనూ యంత్రాలతో కోత పనులు చేపడుతున్నారు. కొనుగోలు కేంద్రాలు మొదలుకాకపోవటం, వర్షాలకు ఆరబెట్టే వీలులేక పచ్చిధాన్యాన్ని నేరుగా ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. వర్షాలు కురుస్తుండటం, నేల తడిగా ఉండటంతో వేంసూరు, పెనుబల్లి, తల్లాడ, సత్తుపల్లి మండలాల్లో రైతులు వేచిచూస్తున్నారు. ఎండలు కాస్తే వారం, పది రోజుల్లో వరికోతలకు పూనుకుంటారు. పాలేరు, ఖమ్మం, మధిర, వైరా నియోజకవర్గాల్లో వరిపైర్లు నవంబర్‌లో కోతకు రానున్నాయి.

**3.69 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణే లక్ష్యం**

వానాకాలం ధాన్యం సేకరణకు ప్రణాళికలు రూపొందించారు. జిల్లాలో 6.13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా



వేశారు. అందులో స్థానిక అవసరాలు, మిల్లర్లు, ట్రేడర్లు కొనుగోలు చేయగా.. మిగిలిన 3.69 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో 3.51 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకాలు, 18వేల మె.ట. దొడ్డురకాలను కొననున్నారు. సన్నాల కోసం 292, దొడ్డు రకాల కొనుగోలుకు 34 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.

**గత సమస్యలు పునరావృతం కాకుండా**

జిల్లాలో కొనుగోలు లక్ష్యం మేరకు 92.40లక్షల గోనెసంచులు అవసరమవగా 43.52లక్షల సంచులే అందుబాటులో ఉన్నాయి. యాసంగిలో కొనుగోలు కేంద్రాలను ఆలస్యంగా ప్రారంభించటంతో కొన్నిచోట్ల గన్నీసంచుల కొరత నెలకొంది. సకాలంలో మిల్లులు కేటాయించలేదు. మిల్లులు కేటాయించిన కేంద్రాల నుంచి ఎక్కువ లారీల్లో వడ్లు వెళ్లటంతో దిగుమతికి నిరీక్షించాల్సి వచ్చింది. వారం పాటు ఎగుమతి, దిగుమతి సమస్యలు ఎదురయ్యాయి. 'ఈనెల 25న కల్లూరులో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తాం. కోతలను బట్టి మిగిలిన మండలాల్లోనూ ఏర్పాటుచేస్తాం. అన్నదాతలకు ఇబ్బందులు తలెత్తకుండా వసతులు కల్పిస్తాం' అని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డి కు తెలిపారు. వానాకాలంలో 35 ఎకరాల్లో వరి సాగుచేశాం. కల్లాలు లేకపోవటంతో వర్షాలకు ధాన్యం ఆరబెట్టుకునే వీలులేదు. ముందస్తుగా వరి పండే మా మండలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయకపోవటంతో ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నాం. ప్రభుత్వం అందజేసే బోనస్ కోల్పోతున్నా.. విధిలేక అమ్ముకుంటున్నాం.

పోట్రు కార్తీక్, యర్రబోయినపల్లి, కల్లూరు మండలం

# ఇదేం పద్ధతి 'గురూ'!

కొత్తగూడెం : జువెనైల్ హోంలో చిన్నారులను కంటికి రెప్పలా కాపాడాల్సిన సంరక్షకుడే కామాంధుడిగా మారాడు. హైదరాబాద్ నగరంలోని సైదాబాద్ జైల్ గార్డెన్‌లోని ప్రభుత్వ వీధి బాలురగృహంలో ఆరుగురు బాలురపై లైంగిక దాడి చేశాడు. అభం శుభం తెలియని బాలురపై అసహజ రీతిలో తరచూ వేధింపులకు పాల్పడిన ఘటన ఇటీవల వెలుగులోకి వచ్చింది. బాలుడిపై లైంగిక వేధింపుల ఘటన బాధిత విద్యార్థిని మానసికంగా కుంగదీయగా.. పోలీసు కేసు, అవమాన భారం సదరు ఉపాధ్యాయుడిని ఆత్మహత్యకు పురిగొలిపింది. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలంలోని ఓ పాఠశాలలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. విద్యార్థులపై లైంగిక వేధింపులు కేవలం బాధితుల వ్యక్తిగత జీవితాలను మాత్రమే కాదు.. గురుశిష్యుల పవిత్ర బంధం వలాలను పెకిలించి యావత్ విద్యావ్యవస్థ విశ్వసనీయతను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఇలాంటి వేధింపులను అరికట్టడంలో విద్యాసంస్థల నిర్వాహకులు విఫలమైతే పాఠశాలలు, వసతిగృహాలపై విద్యార్థుల తల్లిదండ్రులు నమ్మకం కోల్పోతారు.

**ప్రశ్నార్థకంలో ఉపాధ్యాయ వృత్తి..**

కొంతమంది కీచక ఉపాధ్యాయుల చర్యల వల్ల ఉపాధ్యాయ వృత్తికే మచ్చపడుతోంది. తల్లిదండ్రులు, విద్యార్థులు.. టీచర్లను అనుమానంగా చూసే పరిస్థితి ఏర్పడుతోంది. భవిష్యత్తులో నిందపడుతుందనే భయంతో.. మంచి ఉపాధ్యాయులు సైతం విద్యార్థులతో వ్యక్తిగత సమస్యలు, మానసిక వికాసం గురించి మాట్లాడటానికి సంకోచిస్తారు. ఇది గురుశిష్యుల మధ్య ఆరోగ్యకరమైన బంధాన్ని అడ్డుకుంటుంది.

పోలీసు కేసులు, ఆరోపణలతో తమ పరువుకు భంగం కలిగిందని భావిస్తారు. మానసికంగా కుంగిపోయి ఆత్మహత్యలకూ వెనుకాడరు.

విద్యార్థులపై మానసిక ప్రభావం..

పాఠశాలలు, వసతిగృహాలు సురక్షిత ప్రాంతాలు కాదనే భావన విద్యార్థుల్లో దీర్ఘకాలిక భయాన్ని సృష్టిస్తుంది.

గురువులను ఆదర్శంగా, రక్షకులుగా భావించాల్సిన పిల్లలు వారిపై నమ్మకాన్ని కోల్పోతారు.

బాధిత విద్యార్థులు తీవ్రమైన మానసిక ఆందోళన, కుంగుబాటు, ఏకాగ్రత లోపం వంటి సమస్యలతో బాధపడతారు.

చదువుపై దృష్టిసారించలేరు. ఈ ప్రభావం విద్యార్థుల భవిష్యత్తుపై పడుతుంది.

**వీటిపై దృష్టిసారిస్తేనే..**

లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టం(పోక్సో) గురించి ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి. ఈ చట్టం కింద శిక్షలు కఠినంగా ఉంటాయనే విషయం తెలియాలి. వేధింపులకు పాల్పడే ఉపాధ్యాయులపై తక్షణం శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలతో పాటు క్రిమినల్ కేసులు నమోదుచేయాలి. విద్యార్థులు ధైర్యంగా ఫిర్యాదు చేసేందుకు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించాలి. బాలల హెల్ప్‌లైన్ నంబర్-1098తో కూడిన ఫ్లెక్సీలను విద్యాసంస్థల్లో ఏర్పాటుచేయాలి.

వ్యక్తిగత భద్రత విద్యను పాఠశాలల్లో తప్పనిసరి చేయాలి. పిల్లలు ఏవిషయమైనా తల్లిదండ్రులతో చెప్పుకొనే వాతావరణం కల్పించాలి. పిల్లల అసాధారణ ప్రవర్తన గమనించి వారికి కలుగుతున్న ఇబ్బందులను తెలుసుకోవాలి. ఉన్నతమైన వృత్తిలో ఉన్నామనే విషయాన్ని ప్రతి ఉపాధ్యాయుడు గుర్తించాలి. జువ్వాది వెంకటేశ్వరబాబు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు, కొత్తగూడెం

# సర్వీస్ రహదారి.. అధ్వానంగా మారి

హైదరాబాద్: ‘ అవుటర్‌పైకి ఎక్కడానికి దిగేందుకు సర్వీసు రహదారులే కీలకం. ఆయా రోడ్లు భారీ వర్షాలతో గుంతలు పడ్డాయి. వేగంతో వెళ్లేటప్పుడు చిన్న గుంత ఉన్నాసరే…అది ప్రమాదాలకు దారి తీస్తుంది..’నిర్వహణ వీరిదే..: అవుటర్ రింగ్ రోడ్డు నిర్వహణ బాధ్యతలు ఏడాది క్రితం ప్రభుత్వం ప్రైవేటు సంస్థకు ఇచ్చింది. ప్రధాన రహదారితోపాటు సర్వీసు రహదారులను ఆ సంస్థే చూడాలి. టోల్ వసూళ్లలో ఉన్నంత వేగం.. నిర్వహణలో కన్పించడం లేదు.

ఎక్కడంటే..: నార్సింగి, గండిపేట్‌గేట్, ఆర్థిక జిల్లా, మైహోం అవతార్ తదితర ప్రాంతాల్లో వరద పోటెత్తడంతో పెద్దపెద్ద గుంతలు పడ్డాయి. వివిధ కారణాలతో రెండు వైపులా దాదాపు 14 ప్రాంతాల్లో



అనుసంధానం జరగలేదు. లింకులు లేని చోట సమీపంలోని గ్రామీణ రహదారుల నుంచి వెళ్లి సర్వీసు రహదారులపైకి చేరుకొంటున్నారు. అక్కడ నుంచి అవుటర్ రింగ్‌రోడ్డుపైకి వెళ్తున్నారు.

ఇక్కడ చెరువులు, ఇతర జలవనరులతోపాటు శంషాబాద్, ఘట్‌కేసర్, ఈదులనాగులపల్లి ప్రాంతాల్లో రైల్వే ట్రాక్‌లు అడ్డు వస్తున్నాయి. ఇక్కడ పై వంతెనలు నిర్మించాలి.

# కార్డొచ్చినా అందని సంక్షేమం!,

హుజూరాబాద్ : కొత్త రేషన్ కార్డులు వచ్చినా.. వీటి ద్వారా సంక్షేమ పథకాలు అందక ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేలాది లబ్ధిదారులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. నాలుగైదు నెలలు గడిచినా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు వెబ్ ఆప్షన్ ఇవ్వలేదు. పురపాలికలు, మండల పరిషత్తు కార్యాలయాల్లో ప్రజాపాలన కేంద్రాలు లేక నేరుగా దరఖాస్తులు కూడా ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. సంక్షేమ పథకాల కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా.. తమ చేతుల్లో ఏమీ లేదంటూ సమాధానమిస్తున్నారని రేషన్ లబ్ధిదారులు వాపోతున్నారు.

**నెలల తరబడి తప్పని ఎదురుచూపులు**

రేషన్ కార్డులనే ప్రామాణికంగా చేసుకొని ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న విషయం తెలిసిందే. కానీ ఏళ్ల తరబడి రేషన్ కార్డులు లేక, సంక్షేమ పథకాలు అందక వేలాది మంది నిరుపేదలు నష్టపోవాల్సి వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించి రేషన్ కార్డులు




జారీ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత నెల వరకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించి 87,755 కొత్త రేషన్ కార్డులు మంజూరవగా 1,91,464 మంది సభ్యులు లబ్ధిదారులుగా నమోదయ్యారు. చాలా ఏళ్ల తర్వాత వీరికి రేషన్ కార్డులు వచ్చినప్పటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించక కేవలం ఉచిత బియ్యం తీసుకోవడానికే పరిమితయ్యారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలకు ఏడాదిన్నర నుంచి దరఖాస్తులు స్వీకరించడం లేదు. ఫలితంగా నెలకు 200 యూనిట్ల లోపు విద్యుత్తును వినియోగించే వారికి గృహజ్యోతి, పింఛన్లు, రూ.500లకే ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ వంటి పథకాలు అందక తీవ్ర నిరుత్సాహానికి గురవుతున్నారు. అర్హత కలిగిన వేలాది మంది ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నా.. ప్రభుత్వం మాత్రం దరఖాస్తులు స్వీకరించడానికి అవకాశమివ్వడం లేదు. మీసేవలో వెబ్ ఆప్షన్ ఇచ్చిన తర్వాతే దరఖాస్తు చేసుకోవాలని, అంతవరకు తామేమీ చేయలేమని అధికారులు చెబుతున్నారు.

# ఆరేళ్లుగా.. హమాలీ బకాయిలు!

నల్గొండ : ధాన్యం కొనుగోలుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే నల్గొండ జిల్లాలో ప్రారంభమవగా.. కేంద్రాల్లో విక్రయించడానికి వచ్చిన అన్నదాతలు హమాలీ ఛార్జీలు క్వింటాకు రూ.45 చెల్లించాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. ధాన్యం తూకం వేసి సంచుల్లో నింపి లోడింగ్ చేయడానికి హమాలీలకు రైతులు వీటిని చెల్లించాలి. గతంలో రూ.40 నుంచి రూ.42 వరకు వసూలు చేశారు. ఈసారి ధర పెంచారు. రైతులు హమాలీ ఛార్జీలు చెల్లిస్తే తర్వాత వారి ఖాతాకు జమ చేస్తామని ప్రభుత్వం కొన్ని ఏళ్ల నుంచి చెబుతూ వస్తోంది. కానీ ఇప్పటి వరకు ఏ రైతుకూ ఒక్క రూపాయి జమ చేసిన దాఖలాల్లేవు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇస్తుందా లేక పాత ఒరవడినే కొనసాగిస్తుందా అన్న దానిపైనా స్పష్టత లేదు.

**అన్నదాతలపై భారం** గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల కాలంలో దాదాపు పది విడతల్లో ధాన్యం కొనుగోలు చేశారు. ఆ ఐదేళ్లూ రైతులకు హమాలీ ఛార్జీలు చెల్లించలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మూడో విడత ధాన్యం కొనుగోలుకు ఉపక్రమించింది. ఉమ్మడి జిల్లాలో దాదాపు ఏటా 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుంది. అదే అంచనాలతో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో 90 శాతం రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయిస్తున్నారు. రైతులకు ఉన్న ధరల ప్రకారం హమాలీ ఛార్జీల రూపంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండు సీజన్లకు కలిపి రూ.10.40 కోట్లు వరకు భారం పడింది. పన్నెండు విడతలుగా ఇప్పటి వరకు రూ.58.37 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. బకాయిలు, హమాలీ ఛార్జీల చెల్లింపులపై ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు లేవని పౌరసరఫరాల శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

**ప్రభుత్వం చెల్లించాలి సైదులు, రైతు కనగల్**

కొనుగోలు కేంద్రాల్లోధాన్యం కాంటా వేసిన వెంటనే హమాలీలు ఛార్జీలను రైతుల నుంచి వసూలు చేస్తున్నారు. గతంలో ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పారు. కొన్ని రోజులు గడిచిన తర్వాత రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామన్నారు. కానీ ప్రభుత్వం గత ఛార్జీలనే జమ చేయలేదు. ఈసారైనా ఇచ్చి రైతులపై భారం తగ్గించాలి

# దేవుడి మాన్యం.. కబ్జాదారుల వశం



హైదరాబాద్ : ఆలయ భూములు వందల ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయి. కొందరు పట్టా భూముల పక్కనే ఉండడంతో నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేశారు. ఎండోమెంట్ ట్రైబ్యునల్, కోర్టుల్లో ఈ వివాదాల విచారణ జరిగి కబ్జాదారులను ఖాళీ చేయించేలా ఎవిక్షన్ ఆర్డర్లు వచ్చినా రాజకీయ నేతల ఒత్తిళ్లు, ఇతర కారణాలతో చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. జీహెచ్‌ఎంసీ పరిధిలో 1,736 ఆలయాలు ఉన్నాయి.

**ఆక్రమణలు ఇలా..**

సాతంరాయిలోని కోదండరామాలయానికి శంషాబాద్ రెవెన్యూ పరిధిలో 36.1 ఎకరాలు, గగన్‌పహాడ్ రెవెన్యూ పరిధిలో 35.34 ఎకరాల భూములతో కలిపి మొత్తం 72.04 ఎకరాల భూములు ఉండాలి. ప్రస్తుతం ఏడెకరాలు ఉంది. రూ.కోట్ల విలువైన 65 ఎకరాల భూములు కబ్జాలకు గురయ్యాయి.

కొందుర్గు లక్ష్మీనర్సింహ గుడికి 360 ఎకరాల భూములు ఉండగా, వీటిలో 312 ఎకరాలు మిగిలింది. పది ఎకరాలు పక్కరాష్ట్రాల నుంచి వలస వచ్చినవారు ఆక్రమించారు. 33 ఎకరాల్లో గుడిసెలు వేసి తర్వాత శాశ్వత నిర్మాణాలు చేపట్టారు. 2018లో దేవాదాయశాఖ అధికారులు ట్రైబ్యునల్‌ను ఆశ్రయిస్తే.. మూడు నెలల్లో ఆ స్థలాలను ఖాళీ చేయించాల్సిందిగా ఆదేశాలు వచ్చాయి. కానీ ఇప్పటికీ చర్యలు లేవు.సికింద్రాబాద్ పరిధిలోనూ దేవాదాయశాఖకు చెందిన భూముల్లో కొందరు గుడిసెలు వేసుకున్నారు. ఖాళీ చేయాలని ఆదేశాలొచ్చాయి. స్థానిక నేతల నుంచి వచ్చిన ఒత్తిళ్లతో ఇప్పటికీ చర్యలు తీసుకోలేదు. యాచారంలోని ఓంకారేశ్వరాలయానికి 1,450 ఎకరాల భూములు ఉండగా వీటిలో ఇప్పటికే చాలా వరకు భూములు కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. మిగిలిన భూమి కౌలు రైతుల చేతుల్లోనే ఉంది.

**అత్యధిక కేసులు రంగారెడ్డి జిల్లాలోనే..**

ఎండోమెంట్ ట్రైబ్యునల్‌లో ఏళ్లుగా కేసుల విచారణ సాగుతుండగా.. అధికారులు సరైన సాక్ష్యాధారాలు, ధ్రువపత్రాలు సమర్పించడంలో విఫలమవుతున్నారు. రంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా 252 కేసులు, జంట నగరాల్లో 210 కేసుల్లో విచారణ సాగుతోంది. కొన్ని కేసుల్లో కౌంటర్ దాఖలకు అవకాశమిచ్చినా కొందరు అధికారుల స్పందించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాల వారీగా దేవాదాయశాఖ భూములు(ఎకరాల్లో)

హైదరాబాద్: 5,718

రంగారెడ్డి: 9వేలు

మేడ్చల్: 6వేలు

# కుళ్లు చూసి.. కళ్లు తేలేసి!



కొడంగల్ : కొడంగల్ మండలంలోని చిట్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్ల నుంచి వాసన వస్తోందని ఎవరూ తీసుకెళ్లడం లేదు. ఇటీవల కొందరు తీసుకెళ్లాక తిరిగి ఇచ్చేశారు. మండల పరిధిలోని అన్నారంలోనూ కుళ్లిన గుడ్లు ఇవ్వడంతో చాలామంది వెనక్కి తెచ్చి సిబ్బందికి చూయించారు.యాలాల మండల పరిధిలోని చెన్నారం అంగన్వాడీ కేంద్రంలో ఓ బాలింతకు గుడ్లు ఇవ్వగా.. అవి పాడైనట్లు గుర్తించారు. ఉడికించగానే నలుపు రంగులోకి మారాయని వాపోయారు.

బొంరాస్‌పేట మండలం రేగడిమైలారం అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన గుడ్లు ఇస్తున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. తెలియక వాటిని తినడంతో కొందరు అనారోగ్యం బారిన పడ్డారని గ్రామస్థులు వాపోతున్నారు. జిల్లాలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యతలేని గుడ్లు రావడంతో చిన్నపిల్లలు, వారి తల్లిదండ్రులు, బాలింతలు, గర్భిణులు ఆందోళన చెందుతున్నారు. గుత్తేదారు వాటిని పంపిణీ చేసిన 15 రోజులకే దుర్వాసన వస్తోందని వాపోతున్నారు. కొన్ని కేంద్రాల్లో బాగున్నవాటిని పక్కకు తీసిపెట్టి, మిగితా వాటిని బయట పారేస్తున్నారు. మరికొన్ని కేంద్రాల్లో పాడైనా.. వాటినే పంపిణీ చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తు న్నాయి. అంగన్వాడీల ద్వారా పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశం మంచిదే అయినా.. కొందరి నిర్లక్ష్యం కారణంగా ఇబ్బందులు తప్పడం లేదు.

**ఇళ్లకు తీసుకెళుతున్న చిన్నారులు..**

అంగన్‌వాడీ కేంద్రాల్లో 6 నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులకు నెలకు 16 గుడ్లు అందిస్తున్నారు. వాటిలో పాడైనవి ఉన్నా.. గుర్తించని పిల్లలు వాటిని తీసుకెళ్లి తల్లిదండ్రులకు ఇస్తున్నారు. కొందరు వాసన గుర్తించి వాటిని పారేస్తున్నారు. కొన్నిసార్లు గుడ్డులోపల పాడైనా గుర్తించక ఉడికించి చిన్నారులకు ఇస్తున్నారు. అలాగే గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రంలోనే రోజూ ఒకటి చొప్పున ఉడికించి ఇస్తున్నారు. కొన్ని కేంద్రాల్లో ఉడికించకుండా ఇళ్లకే పంపుతున్నారు. వాటిలో పాడైనవీ ఉంటున్నాయి. గుర్తించకుండా ఉడికించి చూస్తే కుళ్లిపోయిన విషయం బయటపడుతోంది.

**కొత్త గుత్తేదారు సరఫరా చేశారు..**

గుడ్లు సరఫరా చేసే గుత్తేదారు ఇటీవల మారిపోయారు. కొత్త గుత్తేదారు పంపిణీ చేసిన మొదటి బ్యాచ్ గుడ్లు. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ఇంటికి తీసుకెళ్లి ఉడకబెట్టిన తరవాత నల్లగా ఉన్నాయని, వాసన వస్తోందని కొందరు సమాచారం ఇచ్చారు. రేగడిమైలారంలో ఇలాంటి సమస్య వచ్చినట్లు తెలిసింది. అన్నిచోట్లా ఇలాగే ఉంటే ఉన్నతాధికారులకు తెలిపి కాంట్రాక్టు రద్దు చేస్తాం.రూప, సీడీపీఓ, కొడంగల్

**నమోదు ఇలా..**

గర్భిణులు: 5,909

బాలింతలు: 4,507 పిల్లలు: 31,225

# వ్యాధి ముదిరాకే చికిత్సలకు..!



హైదరాబాద్: చాపకింద నీరులా మహిళల్లో రొమ్ము క్యాన్సర్ కోరలు చాస్తోంది. చాలామందికి అవగాహన లేకపోవడం, సామాజిక బిడియం వల్ల వ్యాధి బాగా ముదిరే వరకు పరీక్షలు చేయించుకోవడం లేదు. 60–70 శాతం మంది చివరి దశలో వైద్యులను సంప్రదిస్తున్నారు. ఎంఎన్‌జే ప్రభుత్వ క్యాన్సర్ ఆసుపత్రికి వచ్చే రోగుల్లో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తోంది. ఇతర క్యాన్సర్ ఆసుపత్రులకు సైతం బ్రెస్ట్ క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయి. రొమ్ములో అసాధారణ కణజాలం పెరిగితే అది క్యాన్సర్‌కు దారి తీస్తుంది. గడ్డలు ఉన్నంత మాత్రాన అది క్యాన్సర్ అని నిర్ధారణకు రాకూడదు. తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవడం అవసరం. తొలి దశలోనే గుర్తిస్తే వ్యాధిని నియంత్రించవచ్చు. చాలామందిలో అవగాహన లేకపోవడం వల్ల నిర్లక్ష్యం చేస్తున్నారు. అక్టోబరు రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసం అయిన నేపథ్యంలో ప్రత్యేక కథనం…

**ఈ లక్షణాలు ఉంటే..**

రొమ్ములో కణితి చేతికి తగిలేలా ఉండటం

చనుమొన నుంచి రక్తం, ఇతర స్రావాలు కారడం

చనుమొన చొట్టపడి లోపలకు పోవడం

రొమ్ము ఆకృతిలో మార్పు

గజ్జల్లో వాపు

వ్యాధికి ప్రధాన కారణాలు…

జీవనశైలిలో మార్పులు

అధిక కొవ్వుతో కూడిన ఆహారం

అధిక బరువు, మద్యం సేవించడం

కుటుంబంలో క్యాన్సర్ చరిత్ర

ఆలస్యంగా పిల్లలు పుట్టడం

హార్మోన్ల ప్రభావం

చిన్న వయసులోనే రుతుక్రమం ప్రారంభం

**ముందస్తు పరీక్షలు అవసరం**

రొమ్ము క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తించడం ద్వారా నియంత్రించవచ్చు. 40 ఏళ్లు దాటిన ప్రతి మహిళ మమోగ్రామ్ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి. కుటుంబంలో తల్లి, తోబుట్టువుకు గతంలో వ్యాధి ఉంటే మిగతావారు అప్రమత్తంగా ఉండాలి. నెలలో ఒకసారి స్వీయ పరీక్ష చేసుకోవాలి. గడ్డల లాంటివి చేతికి తగిలితే ఆందోళన పడకుండా పరీక్షలు చేయించుకోవాలి. జీవనశైలిలో మార్పులు చేసుకోవడం ద్వారా వ్యాధి బారిన పడకుండా చూసుకోవచ్చు.ప్రొఫెసర్ రఘునాథ్‌రావు, మెడికల్ అంకాలజీ, ఎంఎన్‌జే

# కల్లాలకు మోక్షం.. వెతలు తీరే మార్గం

రాచర్ల : రహదారిపై ధాన్యం ఆరబెట్టిన ఈ దృశ్యం ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ గ్రామ సమీపంలోనిది. ఈ ఒక్క రోడ్డే కాదు.. జిల్లాలోని ప్రధాన రహదారులదీ ఇదే పరిస్థితి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ధాన్యం ఆరబెట్టడం.. తిరిగి కుప్పగా చేయడం పనిలో రైతులు నిమగ్నమవుతున్నారు. రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటుండటంతో పోలీసులు అవగాహన కల్పించినప్పటికీ గత్యంతరం లేని పరిస్థితుల్లో రోడ్లపైనే ఆరబెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలో ఏటా 2.40 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. వరి ధాన్యం, ఇతర పంట ఉత్పత్తుల తేమశాతం తగ్గేంత వరకు ఆరబెట్టడానికి రైతులు నానా తిప్పలు పడుతున్నారు. ప్రస్తుతం సాగు విస్తీర్ణం గణనీయంగా పెరగడం, దిగుబడులు అధికమవడం వల్ల ఎక్కడా ఖాళీ స్థలాలు కనిపించడం లేదు. ఎక్కువ మంది రహదారులను ఆశ్రయిస్తూ ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ క్రమంలో రైతులకు చెందిన వ్యవసాయ పొలాల్లో కల్లాలను నిర్మించాలని కేంద్రం భావించింది. 2021–22 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయశాఖ,



గ్రామీణాభివృద్ధిశాఖలకు కల్లాల నిర్మాణ బాధ్యతను కట్టబెట్టినా లక్ష్యం నెరవేరలేదు. దీంతో ఉపాధి హామీ పథకంలో చేర్చాలని ఇటీవల కేంద్రం నిర్ణయించింది. అధికార యంత్రాంగం సమన్వయంతో ముందుకు సాగితే అనుకున్న లక్ష్యం నెరవేరనుంది.

**వినియోగించుకుంటే మేలు..**

2021–22 ఆర్థిక సంవత్సరంలో మూడు పరిమాణాల్లో పంట కల్లాల నిర్మాణానికి మంజూరు లభించింది. వ్యవసాయ విస్తరణాధికారులు జాబ్‌కార్డులు కలిగి ఉన్న రైతులను ప్రోత్సహిస్తూ వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వాటిని మండల పరిషత్తు కార్యాలయంలో సమర్పిస్తే వెంటనే మంజూరు చేశారు.

ఎస్సీ, ఎస్టీ రైతులకు శతశాతం బిల్లులు వస్తుండగా ఓసీ, బీసీ ఇతర రైతులు నిర్మాణ ఖర్చులో పది శాతం భరించాల్సి ఉంటుంది. 75 చదరపు మీటరు (10 మీటర్ల పొడవు, 7.5 మీటర్ల వెడల్పు)తో కల్లం నిర్మాణానికి రూ.85 వేలు చెల్లిస్తారు.

ఈ పరిమాణం నిర్మాణానికి 79 సిమెంటు బస్తాలు, 4 ట్రాక్టర్ల ఇసుక, మూడు ట్రాక్టర్ల 20 మిల్లీమీటర్ల సైజు కంకర, 5 ట్రాక్టర్ల 40 మిల్లీమీటర్ల సైజు కంకర, 10 ట్రాక్టర్ల మొరం అవసరమవుతుంది.

కల్లం నిర్మాణం పూర్తయిన తర్వాత చుట్టూ ఇనుప పట్టీని అమర్చేందుకు 17 కిలోల ఇనుము అవసరమవుతుంది. 60 చదరపు మీటర్ల పరిమాణం కల్లానికి రూ.68 వేలు, 50 చదరపు మీటర్ల పరిమాణం కల్లానికి రూ.56 వేల చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుంది. తాజాగా ఈ ప్రోత్సాహకాలు పెరిగే అవకాశం ఉన్నందున రైతులు సద్వినియోగం చేసుకుంటే మేలు జరగనుంది.

**జిల్లాలో గత ప్రగతి..**

పంట కల్లాల మంజూరు : 1,717

పూర్తయిన నిర్మాణాలు : 302

బిల్లుల చెల్లింపు : రూ.75.15 లక్షలు

# కావాలి ఆమోదం.. రావాలి శతశాతం!

ఎల్లారెడ్డిపేట : పదో తరగతిలో 2025– 2026 విద్యాసంవత్సరంలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఆదర్శ పాఠశాలలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతూ ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు నవంబరు నుంచి సాయంత్రం స్నాక్స్ (చిరుతిళ్లు) అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ ప్రభుత్వ ఆమోదం కోసం దస్త్రాన్ని పంపారు. సర్కారు నుంచి ప్రతిపాదనలకు మోక్షం కలిగితే జిల్లాలో 3,962 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది.

**గతంలో కంటే భిన్నంగా..**పదో తరగతిలో ఉత్తీర్ణతశాతం పెంచేందుకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ఈ మేరకు జిల్లాలో ప్రత్యేక తరగతులను ఈ నెల 7న ప్రారంభించారు. కొన్నేళ్లుగా సంక్రాంతి సెలవుల తర్వాత లేదా ఫిబ్రవరి 1 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యే వరకు దాదాపు 35 నుంచి 40 రోజులపాటు విద్యార్థులకు చిరుతిళ్లు అందిస్తూ వస్తున్నారు. గతంలోకంటే భిన్నంగా ఈ విద్యాసంవత్సరం దసరా తర్వాత చాలా చోట్ల ప్రత్యేక తరగతులు



మొదలయ్యాయి. మధ్యాహ్నం ఇంటి గంటకు భోజనం చేస్తే.. ప్రత్యేక తరగతులు పూర్తయి ఇళ్లకు వెళ్లే సరికి ఇతర గ్రామాల విద్యార్థులకు రాత్రి 7 గంటలు దాటుతోంది. అప్పటి వరకు ఏమీ తినకపోవడంతో ఆకలితో అలమ టిస్తున్నారు. గతంలో జిల్లా కలెక్టర్ నిర్ణయం మేరకు సాయంత్రం పూట స్నాక్స్ అందించేవారు. గ్రామాల్లోని కొందరు దాతలు ముందు కొచ్చి, స్నాక్స్ కోసం కొంత డబ్బును విరాళంగా అందించేవారు. అయితే 2023లో విద్యాశాఖ ‘సమగ్ర శిక్ష అభియాన్’ ద్వారా 34 రోజులపాటు స్నాక్స్ అందించేలా ఉత్తర్వులు జారీ చేసింది.

**ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.15**జిల్లాలోని సిరిసిల్ల మున్సిపాలిటీ సహా 13 మండలాల్లో 7 ఆదర్శ పాఠశాలలు, 112 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలున్నాయి. స్నాక్స్ కోసం ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.15 చొప్పున మంజూరు చేయనున్నారు. ఈ విషయాన్ని విద్యాశాఖ సర్కారు అందించిన నివేదికలో వివరించింది. ప్రభుత్వం నుంచి ఆమోదం లభిస్తే ఉడకబెట్టిన పెసర్లు, బబ్బెర్లు లేదా పల్లీలు–బెల్లం, చిరుధాన్యాలతో తయారు చేసిన మిల్లెట్ బిస్కెట్లు, ఉల్లిపాయ పకోడి, ఉడకబెట్టిన శనగల్లో రోజుకు ఒకరకం ఇవ్వనున్నారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీల మహిళలే వాటిని సరఫరా చేస్తారు. ఈ లెక్కన జిల్లాలో రోజుకు సుమారు రూ.59,430 చొప్పున 40 రోజులకు గణిస్తే రూ.23.77 లక్షల బడ్జెట్ అవసరమవుతుంది. పదో తరగతిలో ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు స్నాక్స్ అందించాలని ప్రభుత్వం త్వరితగతిన పెరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

# నత్తనడకన పనులు.. పర్యవేక్షణ కరవు

ధర్మపురి : ధర్మపురిలోని బోయవాడలో ఓ ఇంటి ముందు పాత నల్లా కనెక్షన్ తొలగించి అమృత్ 2.0 పథకంలో భాగంగా పైపులైన్ కోసం నెలరోజుల క్రితం కందకాన్ని తవ్వారు. ఇప్పటికి పనులు చేపట్టకపోవడంతో తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సంబంధిత గుత్తేదారుకు చెప్పినా పట్టించుకోవటం లేదని ఇంటి యజమానురాలు వాపోయింది. ఇటీవల కురిసిన వర్షానికి గుంతలో నీరు చేరి అసౌకర్యానికి గురయ్యామంది.

జిల్లాలోని అయిదు పురపాలికల్లో తాగునీటి సౌకర్యం మెరుగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమృత్ 2.0 కింద చేపట్టిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. వచ్చే ఏడాది జూన్ వరకు పూర్తి కావాల్సి ఉండగా ఇప్పటికీ 50 శాతానికి కూడా చేరువ కాలేదు. పైపులైన్‌ల కోసం కందకాలు తీసి అలాగే వదిలేశారు. మిషన్ భగీరథ, అమృత్ పథకం గోతులతో రోడ్లు నాశనం అవుతున్నాయి. పాత నల్లాల తొలగింపు.. అమృత్ 2.0 నత్తనడక పనులతో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ కరవైంది. గుత్తేదారుల వైఖరితో పురపాలకల కమిషనర్లకు తలనొప్పిగా మారింది. ఉదయం ఈ సమస్యలపై వారికి ఫిర్యాదులు వస్తున్నాయి.

**పురపాలికల వారీగా ఇలా**



జగిత్యాల : రూ.38 కోట్ల నిధులు మంజూరు. నాలుగు సంపులు కట్టాల్సి ఉండగా 3 ప్రారంభించారు. 30 కి.మీల పైపులైన్ పనులకు 7 కి.మీలు మాత్రమే పూర్తయింది

కోరుట్ల : 41కి.మీల పైపులైన్‌కు 5.20 కి.మీలు వేశారు. రూ.41 కోట్ల నిధులు మంజూరు చేశారు.

మెట్‌పల్లి : రూ.19 కోట్లు రాగా.. 29 కిమీల పైపులైన్‌కు 7 కి.మీల పనుల మాత్రమే జరిగాయి.

రాయికల్ : రూ.15 కోట్లు కేటాయించారు. నీటి సంపులతో పాటు 20 కి.మీల పైపులైన్ నిర్మించాల్సి ఉంది.

ధర్మపురి : రెండు బృహత్తర నీటి ట్యాంకుల నిర్మాణాలు ప్రారంభించారు. మార్కెట్, మిషన్ భగీరథ కార్యాలయం వద్ద నిర్మించాల్సి ఉండగా.. మార్కెట్ స్థలం వద్ద మాత్రమే పనులు నడుస్తున్నాయి. మిషన్ భగీరథ కార్యాలయం వద్ద వర్షపు నీరు చేరటంతో నిలిచి పోయాయి. 25 కి.మీల పైపులైన్ వేయాల్సి ఉండగా, 12 కి.మీలు మాత్రమే వేశారు. రూ.23 కోట్లతో పనులు చేస్తున్నారు.

**పనులు వేగవంతమయ్యేలా చర్యలు**


అమృత్ 2.0 పనుల ప్రగతిపై ఎప్పటికప్పుడు సిబ్బందికి లక్ష్యాన్ని నిర్ణయిస్తున్నాం. ప్రజల నుంచి పనులపై ఫిర్యాదులు రాగానే స్వయంగా వెళ్లి పరిశీలిస్తున్నాను. పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. పనులు నెమ్మదిగా జరుగుతున్న మాట వాస్తమే.. వేగవంతమయ్యేలా చర్యలు చేపడతాం. శ్రీనివాస్‌రావు, ధర్మపురి, పుర కమిషనర్

# నాడి పట్టిన రైతుబిడ్డలు

జగిత్యాల : వెయ్యి మైళ్ల దూరమైనా ఒక్క అడుగుతోనే ప్రారంభమవుతుంది.. ఉన్నత స్థాయికి ఎదగాలన్న కోరిక అందరికీ ఉంటుంది.. ఇందులో మొదటి అడుగు వేసే వారు మిగతా వారికి స్ఫూర్తిగా నిలుస్తారు.. అలా ఒకరిని చూసి మరొకరు పిల్లలను వైద్య విద్య చదివిస్తుండటంతో గ్రామంలో పది మందికి పైగా కాబోయే డాక్టర్లున్నారు.. జగిత్యాల గ్రామీణ మండలం లక్ష్మీపూర్ వ్యవసాయ పరంగా గణనీయ అభివృద్ధి సాధించింది. ఇక్కడి రైతులు ఆధునిక పద్ధతులతో సాగును లాభసాటిగా మార్చుకున్నారు. ఈ ఊరిలో ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. 13 మంది వైద్యులు, వైద్య విద్యార్థులు ఉన్నారు. ఆరేళ్ల కిందట ఈ సంఖ్య ఒకటి. ఒకరిని చూసి మరొరకు రైతు బిడ్డలు నాడి పట్టిన తీరు స్ఫూర్తిదాయకమే.

**ఒకరిని చూసి మరొకరు..**

గ్రామంలో గతంలో ఓ వైద్యురాలుండగా ఆరేళ్ల కిందట చదువు పూర్తి చేసిన మహేశ్‌రెడ్డి జగిత్యాలలోని గొల్లపల్లి రోడ్‌లో వైద్యశాల ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు. గ్రామస్థులకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. స్థానిక రైతు సంఘం నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి కూతురు శ్రేయ కరీంనగర్‌లోని ప్రైవేటు కళాశాలలో ఎంబీబీఎస్ చివరి సంవత్సరం చదువుతూ పీజీకి సిద్ధమవుతున్నారు. గడ్డం తిరుపతిరెడ్డి కుమారుడు గోవర్ధన్‌రెడ్డి నిజామాబాద్‌లో వైద్య విద్య పూర్తి చేసి పీజీకి సిద్ధమవుతున్నారు. ఎర్రవల్లి జనార్దన్ కొడుకు శ్రీనాథ్, నేతి రమేశ్ కుమారుడు రాకేశ్, కొడిమ్యాల రమేశ్ కుమారుడు నవీన్ వైద్య విద్య అభ్యసిస్తున్నారు.



**ఆలోచింపజేసిన ఆ ఘటన**

లక్ష్మీపూర్ గ్రామ జనాభా 4 వేలకు పైగా ఉండగా రైతు కుటుంబాలే అధికం. అధిక దిగుబడులతో ఇక్కడి అన్నదాతలు ఆదర్శంగా నిలుస్తున్నారు. గ్రామానికి చెందిన కొప్పెర వెంకట్‌రెడ్డి కొడుకు మహేశ్‌రెడ్డి ఆరేళ్ల కిందట వైద్య పూర్తి చేయడంతో రైతు సంఘం ఆధ్వర్యంలో గ్రామంలో సన్మానించారు. ఇది చూసిన చాలా మంది రైతులు ఆలోచనలో పడ్డారు. తమ పిల్లలను ఎందుకు వైద్య విద్య చదివించకూడదని భావించారు. అలా ఒకరిని చూసి మరొకరు పిల్లలను వైద్య విద్యలో చేర్చారు. పెద్దల కోరికకు తగ్గట్టుగా పిల్లలు కూడా కష్టపడి చదువుతున్నారు. ప్రస్తుతం ఈ ఊరిలో వైద్యులు, వైద్య విద్యార్థులు 13 మంది ఉండగా ఇందులో చాలా మంది ప్రతిభ ఆధారంగా ఉచిత సీటు పొందిన వారే కావడం విశేషం.

# చెరువులను చెరబట్టి మట్టిని మింగేసి



గంగాధర : పల్లెల్లో వ్యవసాయానికి, వృత్తి పనులకు ఆధారంగా ఉంటున్న నీటి వనరులు కొందరి నిర్వాకంతో కుచించుకు పోతున్నాయి. వర్షాలకు నీటితో కళకళలాడాల్సిన చెరువులు, కుంటలను ఆక్రమించి పంటలు సాగు చేయడంతో వాటి ఉనికికే ప్రమాదం వాటిల్లుతోంది.

**శిఖం భూమి కబ్జా**

గంగాధరలోని గర్శకుర్తిలో ఊర చెరువు 55 ఎకరాల్లో విస్తరించి ఉండగా దాదాపు 350 ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తుంది. ఊరంతటికీ మంచినీటిని అందించే బావి కూడా ఈ చెరువులోనే ఉంది. వర్షాలకు చెరువు నిండి భూగర్భజలాలు అందుబాటులో ఉంచుతున్న ఈ చెరువును కొందరు ఆక్రమించి పంటలు వేశారు. ఒకరు ఏకంగా చెరువు నీటిలో మోటారు పంపుసెట్ ఏర్పాటుచేసి నీటిని తోడేస్తున్నారు. ఇందుకోసం అక్రమంగా విద్యుత్తు వినియోగిస్తున్నారు.

**10 ఎకరాల్లో..**

చెరువు శిఖం ఆక్రమణలపై గ్రామంలోని 110 మత్స్యకారుల కుటుంబాలు ఇటీవల స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. మోటారు పంపుసెట్ తొలగించి గ్రామ పంచాయతీలో అప్పగిస్తే తమపైనే పోలీసులకు ఫిర్యాదు చేశారని ఆవేదన చెందారు. చెరువు శిఖం భూమి దాదాపు 10 ఎకరాల్లో కొందరు చెరువులోని మట్టి తవ్వి పోయడంతో చెరువు కుచించుకుపోయింది. పదెకరాలు ఆక్రమించిన చెరువు చుట్టూ శిఖం భూమిలో పలువురు పంటలు సాగు చేశారు. చెరువులో 2 లక్షల చేప పిల్లలు పెంపకానికి పోస్తే వాటి ఉనికే లేకుండా పోయిందని మత్స్యకార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. చెరువు చుట్టూ ఉన్న గట్టు కాలువను కొందరు ఆక్రమించడంతో వర్షాలకు చెరువులోకి నీరు రావడం లేదన్నారు.

**ఇంకా ఎక్కడెక్కడంటే..**

గంగాధర పరిధిలోని 19 రెవెన్యూ గ్రామాల పరిధిలో 14 పెద్ద చెరువులు, 74 చిన్న నీటి వనరులున్నాయి. వేసవికి ముందు ఎల్లంపల్లి ప్రాజెక్టుతో చెరువులు, కుంటలు నింపుతుండగా దానికంటే ముందుగానే ఆయా గ్రామాల్లోని చెరువుల శిఖం భూములను కొందరు చెర పట్టించారు. గంగాధర, నారాయణపూర్, లక్ష్మీదేవిపల్లి, ర్యాలపల్లి, గట్టుబూత్కూర్, సర్వారెడ్డిపల్లి గ్రామాల్లోని చెరువుల్లో విలువైన భూములను కబ్జా చేసి తమ పంట భూముల్లో కలిపేసుకున్నారు. వీరిని అధికారులు గానీ ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ఏళ్లుగా వారి కబంధ హస్తాల్లోనే ఈ భూములు ఉంటున్నాయి.

**సర్వే చేసి స్వాధీనం చేసుకుంటాం** గర్శకుర్తిలోని చెరువు శిఖం భూములపై వెంటనే సర్వే చేసి ఆక్రమణ జరిగినట్లు తేలితే స్వాధీనం చేసుకుంటాం. ఇంకా ఎక్కడైనా కబ్జాకు గురైతే సర్వేయర్, ఆర్ఐలు, సిబ్బందితో సర్వే జరిపిస్తాం. ఆక్రమణదారులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. రజిత, తహసీల్దారు, గంగాధర

# చిత్రం పెట్టు.. బిల్లు రాబట్టు



సిరిసిల్ల : ఇంటి నిర్మాణానికి సంబంధించిన చిత్రాలు పంచాయతీ కార్యదర్శులు ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో నిక్షిప్తం చేసేవారు. ఆ తర్వాత ఏఈ, డీఈ, పీడీ, జిల్లా కలెక్టర్, ఆపైస్థాయి అధికారుల పరిశీలన పిదప ఏఐ సహకారంతో పక్షం రోజుల్లో బిల్లుల చెల్లింపులు జరిగేవి. బేస్‌మెంట్ దశలో రూ.లక్ష, గోడల దశలో రూ.లక్ష, శ్లాబు పూర్తయితే రూ.2 లక్షలు, నిర్మాణం పూర్తయిన తర్వాత రూ.లక్ష ఇలా.. రూ.5 లక్షలు లబ్ధిదారుల ఖాతాలో జమయ్యేవి. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను పరిగణనలోకి తీసుకున్న సర్కారు ఇళ్ల పథకానికి సంబంధించిన యాప్‌లో కొత్త ఐచ్ఛికాన్ని తీసుకొచ్చింది. బిల్లుల కోసం ప్రతిపాదనలు పంపడంలో జాప్యాన్ని నివారించేందుకు సదరు యాప్‌లో చిత్రాలను అప్‌లోడ్ చేసే అవకాశాన్ని లబ్ధిదారులకు ఇచ్చింది.ప్రతి పేద కుటుంబానికి సొంత గూడు అందించాలని సర్కారు నిర్ణయించింది. పారదర్శకంగా ఎంపికతోపాటు నిర్మాణంలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ముందుకు సాగుతోంది. సాంకేతిక వినియోగంతో లబ్ధిదారులకు మేలు చేకూర్చేందుకు మరో అడుగు ముందుకేసింది. నిర్మాణానికి సంబంధించిన చిత్రాలను ఇందిరమ్మ వెబ్‌సైట్‌లో నిక్షిప్తం చేసే అవకాశాన్ని లబ్ధిదారులకే కల్పించింది. ఫలితంగా త్వరితగతిన బిల్లుల చెల్లింపునకు మార్గం సుగమం అయ్యింది.

**వేగం పెంచేందుకే..**

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పురోగతి తీసుకొచ్చేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. భవనానికి అవసరమైన ఇసుక, మట్టిని ఉచితంగా అందిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఆర్థిక, ఇతర కారణాలతో నిర్మాణాలు మందకొడిగా సాగింది. జిల్లా పాలనాధికారి ప్రత్యేక చొరవతో ప్రస్తుతం జిల్లాలో యాభైశాతానికి పైగా ఇళ్ల నిర్మాణం పురోగతి సాధించింది.

పేద, మధ్య తరగతి కుటుంబాలు కొత్తగా ఇంటిని ప్రారంభించేందుకు అవసరమైన మూలధనాన్ని సమకూరుస్తున్నారు. మహిళా సంఘాల సభ్యులకు సెర్ప్ ఆధ్వర్యంలో రూ.లక్ష మూల ధనాన్ని రుణ రూపంలో అందిస్తున్నారు. ఇప్పటి వరకు ఏడు వందల మంది పొదుపు సంఘాల సభ్యులకు రూ.7 కోట్ల రుణాలను పంపిణీ చేశారు. ఈ డబ్బులను బ్యాంకు లింకేజీ, వ్యక్తిగత రుణాలు, స్త్రీ నిధి ద్వారా ఖాతాల్లో జమచేశారు.

దరఖాస్తు సమయంలో ఇచ్చిన చరవాణి నంబర్, ఓటీపీ సాయంలో ఇందిరమ్మ యాప్‌లో లాగిన్ అవ్వాల్సి ఉంటుంది. ఇంటి నిర్మాణం దశలో నలుమూలల తీసిన చిత్రాలను అందులో నిక్షిప్తం చేయాలి. ఆ తర్వాత అక్కడ వచ్చిన ప్రశ్నలకు సమాధానం నమోదుతో ప్రక్రియ పూర్తవుతుంది. లబ్ధిదారుడు అప్‌లోడ్ చేసిన చిత్రాలు సరైనవో కావో మరోసారి అధికారులు ధ్రువీకరించాల్సి ఉంటుంది. తప్పని తేలితే బిల్లులు చెల్లింపు జరగదు.

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల స్వరూపం

మంజూరు 10234

మార్కింగ్ ఇచ్చినవి 5308


బేస్‌మెంట్ స్థాయి 2549

శ్లాబు స్థాయి 618

పూర్తయినవి 285

చెల్లించిన బిల్లులు రూ.40 కోట్లు

# అమలులోకి పంట ధరలు పెంపు



జగిత్యాల : ప్రభుత్వం పంట ఉత్పత్తులకు పెంచిన కనీస మద్దతు ధరలు(ఎంఎస్‌పీ) ఈ నెలలో అమల్లోకిరాగా.. ఈ ధరలు ఏడాదిపాటు వర్తించనున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఈ వానాకాలంలో 9.70 లక్షల ఎకరాల్లో వరి ప్రధాన పంటగా ఉండగా.. ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామనడంతో సన్నాలను 25-40 శాతం విస్తీర్ణంలో సాగు చేశారు. అక్టోబరు మొదటివారం నుంచి వరి కోతలు, ధాన్యం సేకరణ మొదలుకానున్నాయి. **మార్క్‌ఫెడ్ ద్వారా పరిమితమే..**

పత్తిని 1.60 లక్షల ఎకరాల్లో సాగు చేస్తుండగా సీసీఐ ద్వారా కేవలం 2-16 శాతం పంటనే కొనుగోలు చేస్తుండగా.. మిగిలిన పత్తిని రైతులు మార్కెట్లు, గ్రామాల్లో ప్రైవేటు వ్యక్తులకు తక్కువ ధరకు విక్రయించి నష్టపోతున్నారు. కేంద్రం కోటా ఇవ్వలేదనే కారణంతో కందులను అత్యంత పరిమితంగానే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తుండటంతో రైతులందరికీ మద్దతు ధర దక్కడంలేదు. మక్కలకు బయటి మార్కెట్లో ధర తగ్గితే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలి. వేరుసెనగ, సెనగలు, మినుములు, పెసలు, సోయాబీన్ తదితర ఉత్పత్తుల సేకరణనూ చేపట్టాల్సి ఉంటుంది.పసుపు పంటకు ఈ సీజన్‌లోనూ మద్దతు ధరను ప్రకటించనందునా విపణి ధరపైనే రైతులు ఆధారపడాల్సి ఉంటుంది.

# లాభాల వాటా.. దీపావళి బోనస్

గోదావరిఖని : కార్మికులకు లాభాల వాటాతో పాటు పీఎల్ఆర్ బోనస్ తేలే అవకాశం ఉంది. అదే విధంగా ఏటా దీపావళి ముందు చెల్లించే పీఎల్ఆర్ బోనస్‌పై కూడా దిల్లీలో జేబీసీసీఐ కమిటీ సమావేశం కానుంది. దీంతో రెండు ప్రయోజనాలు ఒకే రోజే తేలే అవకాశం ఉంది. ఏటా చెల్లించే లాభాల వాటాపై సింగరేణి కార్మికులు ఎదురు చూస్తున్నారు. ఈసారి ఆలస్యమైందన్న అభిప్రాయం కార్మికుల్లో వెల్లడైంది. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలతో పాటు కోల్‌బెల్టు ప్రాంత ఎమ్మెల్యేల సమక్షంలో ముఖ్యమంత్రి ప్రకటించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇక పీఎల్ఆర్ బోనస్‌పై కోల్ ఇండియా యాజమాన్యంతో జేబీసీసీఐ సంఘాల ప్రతినిధులు దిల్లీలో సమావేశమై నిర్ణయించనున్నారు.

**35 శాతం చెల్లించాలని డిమాండ్**

గతేడాది కంటే కార్మికులకు వాటా శాతం పెరిగే అవకాశం ఉంది. గతేడాది 33 శాతం వాటాను పంపిణీ చేశారు. ఈసారి 35 శాతం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే గతేడాది కంటే 2024-25 ఆర్థిక సంవత్సరంలో లాభాలు ఎక్కువగా వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో కార్మికులకు వాటా కూడా ఎక్కువగానే లభించే అవకాశం ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సంస్థ రూ.2,412 కోట్ల లాభాలు గడించింది. దీనిపై కార్మికులకు 33 శాతం వాటా కింద రూ.795 కోట్లు పంపిణీ చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో



69.01 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయగా రూ.40 వేల కోట్లకు పైగానే వ్యాపారం చేసింది. దీంతో లాభాలు కూడా అధికంగానే వచ్చే అవకాశం ఉంది. ఎంత శాతం ప్రకటించాలన్న దానిపై ముఖ్యమంత్రి నిర్ణయించనున్నారు. సోమవారం ఉదయం సీఎం గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలతో పాటు కోల్‌బెల్టు ఎమ్మెల్యేల సమక్షంలో వాటా శాతాన్ని ప్రకటించేందుకు సమయం ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో లాభాల వాటాపై ఉన్న సందేహాలు తొలగిపోయే అవకాశం ఉంది.

**రూ.లక్షకు పైగానే..**

ఈ ఏడాది ప్రతిభ ఆధారిత ప్రయోజనం(పీఎల్ఆర్) ప్రయోజనం కూడా పెరిగే అవకాశం ఉంది. కోల్ ఇండియా, జాతీయ కార్మిక సంఘాల జేబీసీసీఐ సమావేశం దిల్లీలో సోమవారం ఏర్పాటు చేశారు. కోల్ ఇండియాలో పనిచేసే కార్మికులకు దసరా ముందు, సింగరేణి కార్మికులకు దీపావళి పండగల ముందు చెల్లించే పీఎల్ఆర్ బోనస్‌పై నిర్ణయం తీసుకోనున్నారు. గత సంవత్సరం రూ.93,750 చెల్లించారు. ఈసారి అంతకంటే ఎక్కువగానే పంపిణీ చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో ఈ ఏడాది సుమారు రూ.లక్షకు పైనే పంపిణీ చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రతి సంవత్సరం కొంత పెంచుకుంటూ వస్తున్న కోల్ ఇండియా యాజమాన్యం ఈసారి కూడా పెరుగుదల అంచనా ప్రకారం రూ.లక్ష వరకు చెల్లించే అవకాశం ఉంది.

# ఎరువు కొనరు.. తయారు చేస్తారు

మెట్‌పల్లి : వానాకాలం పంటల అవసరాలకు యూరియా కొరతతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. బస్తా ఎరువు కోసం గంటల తరబడి బారులు తీరుతున్నారు. మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్‌కు చెందిన రాజారపు భూమేశ్వర్‌కు మాత్రం అలాంటి చింత లేదు. ఆయన కొన్నేళ్లుగా పూర్తిగా సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేస్తున్నారు. యూరియా అవసరం లేకుండా సహజ ఎరువులను వినియోగిస్తున్నారు. పంటలకు అవసరమైన కషాయాలు సొంతంగా తయారు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు.

**పంట ప్రయోగాలతో గుర్తింపు** భూమేశ్వర్ గతంలోనే పంటల సాగులో పలు ప్రయోగాలతో గుర్తింపు పొందారు. దాదాపు పదిహేనేళ్ల కిందటే



ప్రకృతి సేద్యంపై అవగాహన పెంచుకున్నారు. ఆ తర్వాత సమీకృత వ్యవసాయం వైపు మళ్లారు. ఆవులు, గేదెలు పెంచడమే కాకుండా నాటుకోళ్ల ఫారం నిర్వహిస్తున్నా రు. ప్రస్తుతం నాలుగెకరాల్లో సేంద్రియ పద్ధతిలో వరి పండిస్తున్నారు. వానపాములతో వర్మి కంపోస్టు తయారు చేసి పంటల సాగుకు వినియోగిస్తున్నారు. ఆవు మూత్రం, పేడ, బెల్లంతో సొంతంగా జీవామృతం తయారు చేసి నీటితో పాటు పంటలకు అందేలా చూస్తున్నా రు. అంతేకాకుండా వరిలో యూరియాకు బదులు వర్మి కంపోస్టు చల్లడం ద్వారా ఖర్చు తగ్గించుకున్నారు. చీడపీడల నివారణకు నీమాస్త్రం వాడుతున్నారు. రెండెకరాల్లో సాగు చేస్తున్న మొక్కజొన్నకు నానో యూరియా వినియోగిస్తున్నారు. కొన్నేళ్లుగా సొంతంగా వర్మి కంపోస్టు, జీవామృతం తయారు చేసి వినియోగిస్తుండటంతో తనకు యూరియా అవసరం రాలేదని భూమేశ్వర్ పేర్కొన్నారు. రైతులు సేంద్రియ విధానానికి మొగ్గు చూపితే పెట్టుబడి తగ్గి మంచి ఫలితాలు వస్తాయన్నారు.




## తిరుమల పరకామణి చోరీ కేసు విచారణ.. తితిదే అధికారుల తీరుపై హైకోర్టు అసహనం

అమరావతి: తిరుమల పరకామణి చోరీ కేసుపై ఏపీ హైకోర్టులో విచారణ జరిగింది. సీజ్ చేసిన ఫైళ్లు, ప్రాథమిక దర్యాప్తు నివేదికను ఉన్నత న్యాయస్థానానికి సీఐడీ సమర్పించింది. ఈ ఘటనపై కౌంటర్ దాఖలు చేయకపోవడంపై తితిదే ఈవోపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తితిదే అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేసింది. ఈ నెల 27న ఈవో న్యాయస్థానం ముందు హాజరు కావాలని ఆదేశించింది. లేని పక్షంలో రూ.20 వేల జరిమానా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది. ఘటనపై కౌంటర్ దాఖలు చేసేందుకు తితిదే సమయం కోరింది. ఇందుకు సమయమిస్తూ విచారణను ఉన్నత న్యాయస్థానం ఈ నెల 27కు వాయిదా వేసింది. వైకాపా ప్రభుత్వ హయాంలో 2023లో తిరుమల పరకామణిలో చోరీ కేసు నమోదైంది. ఈ ఘటనపై 2023లోనే తితిదే విజిలెన్స్‌కు ఫిర్యాదు అందింది. ఉద్యోగి రవికుమార్ పెద్దఎత్తున పరకామణిని కొల్లగొట్టారని అందులో పేర్కొన్నారు. దీనిపై అప్పటి తితిదే అధికారులు సమగ్ర దర్యాప్తు జరపకుండా లోకాయుక్తతో రాజీ చేయించారు. శ్రీనివాసులు అనే వ్యక్తి పిటిషన్ వేయడంతో హైకోర్టు విచారణకు స్వీకరించింది. మరోవైపు దీనికి సంబంధించి గతంలో ఉన్నత న్యాయస్థానం సీఐడీ విచారణకు ఆదేశించింది. దీంతో పరకామణిలో దస్త్రాలను సీఐడీ సీజ్ చేసింది.




దిల్లీ: ఒక ప్రాంతంలో పరిశ్రమలు రావడానికి కావాల్సిన ఎకో సిస్టమ్ అభివృద్ధి చేసేందుకు అనేక రాయితీలు ఇవ్వాల్సిన అవసరముందని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. విశాఖలో గూగుల్ ఏర్పాటు నేపథ్యంలో పలు రాష్ట్రాల నుంచి వస్తున్న వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. "ఒకసారి ఎకో సిస్టమ్ ఏర్పాటైన తర్వాత రాయితీలు ఇవ్వాల్సిన అవసరముండదు. ప్రస్తుతం గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు తర్వాత విశాఖలో చాలా సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి. బెంగళూరు లాంటి ప్రాంతాల్లో ఒక ఎకో సిస్టమ్ ఏర్పాటైంది. ఆ ప్రాంతంతో విశాఖకు పోలిక అవసరం లేదు. పోస్టల్, బీఎస్ఎన్ఎల్ సంస్థలను కామన్ మ్యాన్‌కి ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటున్నాం. ఖర్చులు ఎక్కువగా ఉండి ఆదాయం తక్కువగా ఉండే పోస్టల్ డిపార్ట్‌మెంట్ బలోపేతానికి చర్యలు చేపడుతున్నాం. రూ.5వేల కోట్లతో పోస్టల్ శాఖ నిలదొక్కుకునేలా కార్యాచరణ ప్రారంభించాం. రాబోయే కాలంలో ఆదాయం అందించే సంస్థగా దీన్ని తీర్చిదిద్దుతాం. దేశంలో ప్రతి మారుమూల గ్రామానికి భారత్ నెట్ సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. బీఎస్ఎన్ఎల్ సేవలను మెరుగు పరచడానికి దాదాపు 20వేల కొత్త సెల్ టవర్లు ఏర్పాటు చేస్తున్నాం" అని పెమ్మసాని వివరించారు.

## మెడికల్ కాలేజీలను పీపీపీతో చేస్తే తప్పేంటి?: మంత్రి సత్యకుమార్



విజయవాడ, అక్టోబర్ 17: పీపీపీ మోడల్‌లో మెడికల్ కళాశాలల నిర్మాణం వల్ల నష్టం లేదని మంత్రి సత్యకుమార్ యాదవ్ మరోసారి స్పష్టం చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ అసత్య ప్రచారంతో రాద్ధాంతం చేస్తుందని మండిపడ్డారు. 33 యేళ్ల తరువాత మళ్లీ ప్రభుత్వానికి ఆ కళాశాలు చెందుతాయని.. మెడికల్ కళాశాలలు పూర్తి అయితే 1500 సీట్లు వస్తాయని.. ఇందులో 725 సీట్లు పూర్తిగా ఉచితమని ప్రకటించారు. ఎన్టీఆర్ వైద్య సేవల కింద కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యం అందిస్తున్నామన్నారు. మెడికల్ కళాశాలలను అందుబాటులోకి తెస్తే ప్రజలకు మంచి జరుగుతుందని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు మంచి చేయాలనే అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రజలకు ప్రతి చోటా మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు మంత్రి. జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు ఏదో మాట్లాడుతూ అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 108, 104లను ప్రైవేటు వ్యక్తులతో నడిపారని గుర్తుచేసిన మంత్రి.. మెడికల్ కళాశాలలను ప్రైవేటు పార్టనర్ షిప్‌తో చేస్తే తప్పేంటి అని ప్రశ్నించారు. అసెంబ్లీకి రా చర్చిద్దాం అంటే వచ్చే ధైర్యం లేదని విమర్శించారు. రిషికొండలో వందల కోట్లు తో భవనాలు నిర్మించారని.. మరి ఈ మెడికల్ కళాశాలలు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. ప్రజలు చదువుకుంటూ యువత మేధో సంపత్తి జగన్ నాశనం చేశారని మండిపడ్డారు. నర్సీపట్నంలో మెడికల్ కళాశాలను జగన్ నిర్మించలేదని.. ఐదు వందల కోట్లు అయితే జగన్ ఖర్చు పెట్టింది ఇరవై కోట్లు మాత్రమే అని తెలిపారు. మెడికల్ కళాశాలకు ఆయన ఇచ్చే నిర్వచనం ఏమిటో జగన్‌కే అర్థం కాదంటూ దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాతే ఈ మెడికల్ కాలేజీల నిర్మాణ పనులు మొదలయ్యాయని పేర్కొన్నారు. ప్రజలను తక్కువ అంచనా చేసిన జగన్‌కు తగిన గుణపాఠం చెప్పారని.. అయినా ఇంకా పాత పద్ధతిలోనే జగన్ వెతుకుతున్నారని విమర్శించారు. సెల్ఫ్ ఫైనాన్స్ స్కీం తెచ్చింది జగనే అని.. ఇప్పుడు ఆయనే విమర్శిస్తున్నారని అన్నారు. బీజేపీ అధికార ప్రతినిధులపై గురుతర బాధ్యతలు ఉన్నాయన్నారు. ఏ అంశం మాట్లాడినా ఆ విషయంపై పరిజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. ఆగ్రహం, ఆనందం, ఆవేదన అయినా మీడియా సమావేశాల్లో, సభల్లో ముఖంలో కూడా కనిపించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.

## బీసీ బిల్లు చంద్రబాబుతోనే సాధ్యం: బీసీ సంఘాలు




విజయవాడ, అక్టోబర్ 17: బీసీ రిజర్వేషన్లకు సంబంధించి ఎంపీ ఆర్ కృష్ణయ్య పిలుపు మేరకు బీసీ కుల సంఘాలు భేటీ అయ్యాయి. డాక్టర్ ఎన్. మారేష్ నేతృత్వంలో బీసీ కుల సంఘాల నేతలు, ప్రతినిధులు ఈరోజు (శుక్రవారం) కీలక సమావేశం నిర్వహించారు. ఈ నెల 26న అన్ని బీసీ కుల సంఘాలు కలసి జేఏసీ ఏర్పాటుకు సిద్ధమయ్యారు. పార్లమెంట్లో బీసీ సాధన కోసం ఆంధ్రప్రదేశ్‌లో జేఏసీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సీఎం చంద్రబాబు బీసీ బిల్లుపై ప్రధాని మోడీతో చర్చించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి బీసీల కోసం పోరాటం చేయటంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎన్ మారేష్ మాట్లాడుతూ.. బీసీలకు రాజ్యాధికారం బీసీ బిల్లుతోనే సాధ్యమని చెప్పుకొచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీ బిల్లుపై ప్రధాని మోడీతో చర్చించాలని కోరారు. టీడీపీ బీసీల పార్టీ స్థాయి నుంచి ఓబీసీల పార్టీగా ఎదగాలన్నారు. కేంద్రంలో నిర్ణయాత్మక శక్తిగా ఉన్న చంద్రబాబు బీసీ బిల్లుపై దృష్టి సారించాలని వినతి చేశారు. జేఏసీ ఆధ్వర్యంలో దేశ స్థాయిలో అన్ని రాజకీయ పార్టీల మద్దతు కోరుతామన్నారు. చంద్రబాబు బీసీలపై తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని అన్నారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు చంద్రబాబుతోనే సాధ్యమని స్పష్టం చేశారు. ఓబీసీల గుండెల్లో చిరస్థాయిగా చంద్రబాబు మిగిలిపోతారని తెలిపారు. బీసీ బిల్లు కోసం యుద్ధాలు అక్కర్లేదని.. లక్షల కోట్ల బడ్జెట్లో అవసరం లేదన్నారు. జనాభాపరంగా బీసీలకు రావాల్సిన వాటా కేటాయిస్తే చాలని చెప్పుకొచ్చారు. జేఏసీ ఆధ్వర్యంలో దశలు వారీగా పార్లమెంటులో బీసీ బిల్లు సాధన ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఎన్ మారేష్ పేర్కొన్నారు.

## పులివెందుల నుంచి ఇద్దరు సీఎంలుగా ఎన్నికైనా ఏం అభివృద్ధి జరిగింది?: బీటెక్ రవి

పులివెందుల: రానున్న స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీకి చెందిన నేతలు ఎవరినీ నామినేషన్లు వేయనీయరంటూ వైకాపా నేత సతీశ్‌రెడ్డి అసత్య ప్రచారం చేయడం సరికాదని పులివెందుల తెదేపా ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి అన్నారు. కొద్దిరోజుల క్రితం జరిగిన జడ్పీటీసీ ఉప ఎన్నికలో 11 మంది నామినేషన్లు వేశారని గుర్తుచేశారు. రెండు చోట్ల రీపోలింగ్ నిర్వహించినా వైకాపాకు డిపాజిట్ దక్కలేదన్నారు. పులివెందులలో నిర్వహించిన మీడియా సమావేశంలో బీటెక్ రవి మాట్లాడారు. ఎన్నికలు జరిగితే ఓడిపోతామని తెలిసే నామినేషన్ వేయనీయరని ఇప్పటి నుంచే తెదేపాపై తప్పుడు ప్రచారానికి కుట్ర చేస్తున్నారన్నారు. "ఎర్రబెల్లి చెరువుకు ఎన్నికల్లో చెప్పినట్లు నీళ్లు ఇచ్చాం. నల్లపురెడ్డిపల్లెలో రెండువేల బోర్లు ఛార్జ్ అయ్యాయి. కొండారెడ్డి చెరువు నిండితే పులివెందులకు నీళ్లిస్తాం. ఇద్దరు ముఖ్యమంత్రులుగా ఎన్నికైనా పులివెందులలో ఏం అభివృద్ధి జరిగింది?రియల్ ఎస్టేట్ కుదేలై ప్రజలు నష్టపోయారు. ఇప్పుడు ఎన్నికలు లేకపోయినా చెప్పినట్లే అభివృద్ధి చేస్తున్నాం.. ఇకపైనా చేస్తాం" అని బీటెక్ రవి అన్నారు.




## సామాన్యులకు ఉపయోగపడేలా పోస్టల్, బీఎస్ఎన్ఎల్ సంస్థల పురోగతి: పెమ్మసాని


ఢిల్లీ అక్టోబరు17 : భారతదేశంలో ప్రతి మారుమూల గ్రామానికి భారత్ నెట్ సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వ్యాఖ్యానించారు. ఒక ప్రాంతంలో పరిశ్రమలు రావడానికి కావలిసిన ఎకో సిస్టమ్స్ అభివృద్ధి చేయడానికి అనేక రాయితీలు ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఒకసారి ఎకో సిస్టమ్ ఏర్పాటు అయిన తర్వాత రాయితీలు ఇవ్వాల్సిన అవసరం ఉండదని చెప్పుకొచ్చారు. ఇవాళ(శుక్రవారం) ఢిల్లీ వేదికగా మీడియాతో మాట్లాడారు పెమ్మసాని చంద్రశేఖర్. ప్రస్తుతం గూగుల్ డాటా సెంటర్ ఏర్పాటైన తర్వాత చాలా సంస్థలు ఆ ప్రాంతంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపిస్తున్నాయని వివరించారు. బెంగళూర్ లాంటి ప్రాంతాల్లో ఒక ఎకో సిస్టం ఏర్పాటైందని.. ఆ ప్రాంతంతో విశాఖపట్నానికి పోలిక అవసరం లేదని స్పష్టం చేశారు. పోస్టల్, బీఎస్ఎన్ఎల్, తదితర సంస్థలను కామన్ మ్యాన్‌కు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు పెమ్మసాని చంద్రశేఖర్. ఖర్చులు ఎక్కువగా ఉండి, ఆదాయం తక్కువగా ఉండే పోస్టల్ డిపార్ట్‌మెంట్ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. రూ.5 వేల కోట్ల నిధులతో పోస్టల్ సంస్థ నిలదొక్కుకునేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పుకొచ్చారు. రాబోయే కాలంలో పోస్టల్ సంస్థను ఆదాయం అందించే సంస్థగా తీర్చిదిద్దుతామని ఉద్ఘాటించారు పెమ్మసాని చంద్రశేఖర్. బీఎస్ఎన్ఎల్ సేవలను మెరుగుపరచడానికి దాదాపుగా 20 వేల కొత్త సెల్ టవర్లను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. వినియోగదారుల భద్రత కోసం సంచార్ సాతి యాప్ సేవలను అందిస్తున్నామని తెలిపారు. టెలికాం వినియోగదారులను ఫైనాన్షియల్ ఫ్రాడ్‌ల నుంచి రక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.




హెచ్-1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల తీసుకున్న నిర్ణయం పెను సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ట్రంప్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ.. అమెరికా ఛాంబర్ ఆఫ్ కామర్స్ న్యాయస్థానంలో సవాల్ చేసింది. 3 లక్షల మంది వ్యాపారులకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ట్రంప్ అధ్యక్షుడిగా పదవీకాలం చేపట్టిన తర్వాత ఆయనపై వేసిన మొదటి దావా ఇది. రాయిటర్స్ ప్రకారం.. హెచ్-1బీ వీసా రుసుమును పెంచుతూ సెప్టెంబరులో ట్రంప్ తీసుకున్న నిర్ణయం ఆయన అధికార పరిధిని మించిందని ఆ గ్రూప్ డీసీలో ఫెడరల్ కోర్టులో దాఖలు చేసిన దావాలో పేర్కొంది. కాంగ్రెస్ తీసుకొచ్చిన సంక్లిష్టమైన వీసా వ్యవస్థను ఇది దెబ్బతీస్తోందని ఆందోళన వ్యక్తంచేసింది. హెచ్-1బీపై ఆధారపడిన వ్యాపారులపై ఇది తీవ్ర ప్రభావం చూపుతోందని ఆ గ్రూప్ వాదించింది. వ్యాపారులు తమ కార్మిక వ్యయాలను పెంచుకోవడం లేదా తక్కువ నైపుణ్యం కలిగినవారిని నియమించుకోవాల్సిన పరిస్థితి వస్తోందని గుర్తించింది. 'అమెరికా ఛాంబర్‌లోని అనేకమంది సభ్యులు హెచ్-1బీ ఉద్యోగులను బలవంతంగా తగ్గించుకొనే పరిస్థితి ఏర్పడింది. ఇది వారి పెట్టుబడిదారులతో పాటు కస్టమర్‌లు, సొంత ఉద్యోగులపైనా తీవ్ర ప్రభావం ఉంటుంది' అని వెల్లడించింది. ఇక, హెచ్-1బీ వీసా ఫీజు పెంపును వ్యతిరేకిస్తూ.. ఇప్పటికే పలు ఉద్యోగ సంఘాలు కోర్టులను ఆశ్రయించిన సంగతి తెలిసిందే.

ఈ క్రమంలో అమెరికా ఛాంబర్ ఆఫ్ కామర్స్ కూడా ట్రంప్ నిర్ణయాన్ని సవాల్ చేయడం గమనార్హం. ఇటీవల ట్రంప్ ప్రకటించిన వీసా ఫీజు పెంపు నిర్ణయం అందరినీ భయాందోళనకు గురిచేసింది. అయితే, హెచ్-1బీ వీసాపై విధించిన లక్ష డాలర్ల రుసుము వార్షిక ఫీజు కాదని, దరఖాస్తు చేసుకొనే సమయంలో కట్టాల్సిన వన్‌టైమ్ ఫీజు అని వైట్‌హౌస్ ఆ తర్వాత స్పష్టతనిచ్చింది. ఇది ఈ వీసా కోసం కొత్తగా దరఖాస్తు చేసుకునేవారికే అమలుచేస్తామని వెల్లడించింది. ప్రస్తుత వీసాదారులకు, రెన్యువల్‌కు వర్తించదని తేల్చిచెప్పింది.

## ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణం చేసిన జస్టిస్ దోనాడి రమేశ్



అమరావతి: ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ దోనాడి రమేశ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ప్రమాణం చేయించారు. అలహాబాద్ హైకోర్టు నుంచి జస్టిస్ దోనాడి రమేశ్ తిరిగి ఏపీ హైకోర్టుకు బదిలీపై వచ్చారు. జస్టిస్ దొనాడి రమేశ్ స్వస్థలం ఉమ్మడి చిత్తూరు జిల్లా మదనపల్లె దగ్గర్లోని కమ్మపల్లి. అన్నపూర్ణమ్మ, నారాయణనాయుడు దంపతులకు 1965 జూన్ 27న జన్మించారు. నారాయణనాయుడు పంచాయతీరాజ్ శాఖలో ఇంజినీర్‌గా పనిచేశారు. జస్టిస్ రమేశ్ తిరుపతి శ్రీవేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాల నుంచి డిగ్రీ పూర్తిచేశారు. నెల్లూరు వీఆర్ లా కళాశాలలో న్యాయశాస్త్రం అభ్యసించారు. ఏపీ బార్ కౌన్సెల్‌లో 1990లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకుని, హైకోర్టులో ప్రాక్టీసు ప్రారంభించారు. జస్టిస్ పీఎస్ నారాయణ న్యాయవాదిగా ఉన్నప్పుడు ఆయన కార్యాలయంలో జూనియర్ న్యాయవాదిగా చేరి వృత్తి మెలకువలు నేర్చుకున్నారు. 2000 డిసెంబరు నుంచి 2004 వరకు ప్రభుత్వ న్యాయవాది(జీపీ)గా సేవలు అందించారు. ఏపీ సర్వశిక్ష అభియాన్‌కు స్టాండింగ్ కౌన్సెల్‌గా 2013 వరకు పనిచేశారు. 2014 నుంచి 2019 వరకు ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ)గా బాధ్యతలు నిర్వర్తించారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులై 2020 జనవరి 13న బాధ్యతలు స్వీకరించారు. అలహాబాద్ హైకోర్టుకు బదిలీపై వెళ్లి 2023 జులై 24న బాధ్యతలు తీసుకున్నారు. తాజాగా ఏపీ హైకోర్టుకు బదిలీ అయ్యారు.

## ఆగ్నేయ అరేబియా సముద్రంలో కొనసాగుతున్న ఆవర్తనం.. అల్పపీడనంగా మారే అవకాశం



ఆగ్నేయ అరేబియా సముద్రంలో ఆవర్తనం కొనసాగుతోంది. సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఇది కేంద్రీకృతమై ఉంది. 24 గంటల్లో అల్పపీడనంగా మారే అవకాశం ఉంది. 48 గంటల్లో వాయుగుండంగా బలపడే అవకాశం ఉంది. తెలుగు రాష్ట్రాల్లో నైరుతి పవనాలు తిరోగమనం చెందాయి. ఉత్తర ఝార?ండ్ వద్ద ఉపరితల ఆవర్తనం నెలకొంది. ఏపీలో వాతావరణశాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. చాలా ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉంది. కొన్ని చోట్ల మోస్తరు వర్షసూచనలు ఉన్నాయి. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఈ నెల 24న మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంది.

## నకిలీ మద్యం కేసులో నిందితుల విచారణ.. నిజాలు బయటకు వచ్చేనా




చిత్తూరు, అక్టోబర్ 17: మొలకలచెరువు నకిలీ మద్యం కేసులో నిందితుల విచారణ మొదలైంది. మద్యం కేసులో పదిమంది నిందితులను ఎక్సైజ్ పోలీసుల కస్టడీకి తంబళ్ల పల్లె కోర్టు అనుమతించిన విషయం తెలిసిందే. కోర్టు అనుమతి మేరకు ఈరోజు (శుక్రవారం) ఉదయం మదనపల్లి సబ్ జైలులో రిమాండ్‌లో ఉన్న పదిమంది నిందితులను ఎక్సైజ్ పోలీసులు తమ కస్టడీలోకి తీసుకున్నారు. ముందుగా వైద్య పరీక్షల నిమిత్తం నిందితులను మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షలు ముగిసిన అనంతరం మదనపల్లిలోని ఎక్సైజ్ కార్యాలయానికి నిందితులను తీసుకువచ్చారు. అనంతరం పది నిందితుల విచారణ ప్రారంభమైంది. తమ కస్టడీకి తీసుకున్న పదిమంది నిందితులను ఎక్సైజ్ పోలీసులు విచారణ చేస్తున్నారు. ఈ కేసులో కీలక నిందితుడు ఏ 13 కట్టా సురేంద్ర నాయుడును పోలీసులు ప్రత్యేకంగా విచారిస్తున్నారు.

మిగిలిన 9 మందిని వేరువేరుగా ఎక్సైజ్ పోలీసులు విచారిస్తున్నారు. కట్ట సురేందర్ నాయుడును మూడు రోజుల పాటు విచారించేందుకు కోర్టు అనుమతించింది. మిగిలిన వారిని రెండు రోజుల పాటు విచారణకు తంబళ్లపల్లి కోర్టు అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. కడప అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, అన్నమయ్య జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపర్డెంట్ జోగేంద్ర, సిట్ బృందం నుంచి మరో అధికారి విచారణ బృందంగా ఏర్పడి విచారణను కొనసాగిస్తున్నారు. ఈ విచారణలో నిందితులు ఈ కేసుకు సంబంధించి ఏ యే విషయాలు బయటపెడతారో చూడాలి.




# మినీ డ్రెస్‌లో రకుల్ అందాల షో

కెరటం సినిమాతో తెలుగు ప్రేక్షకులకు 2011లో పరిచయం అయిన ముద్దుగుమ్మ రకుల్ ప్రీత్ సింగ్. మొదటి సినిమా పెద్దగా కమర్షియల్ సక్సెస్ అవ్వలేదు. అయినా కూడా రకుల్ ప్రీత్ సింగ్‌కు మంచి గుర్తింపు దక్కించుకుంది. తెలుగులో ఈమె వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ సినిమాతో హిట్‌ను సొంతం చేసుకుంది. ఆ సినిమా తర్వాత రకుల్ ప్రీత్ సింగ్ వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. దాదాపుగా పదేళ్ల పాటు టాలీవుడ్‌లో వరుస సినిమాలు చేసింది. టాలీవుడ్‌లో దాదాపు అందరు యంగ్ స్టార్ హీరోలతో రకుల్ ప్రీత్ సినిమాలు చేయడం ద్వారా స్టార్ హీరోయిన్‌గా నిలిచింది.

తక్కువ సమయంలోనే ఎక్కువ సినిమాలు చేసింది. అయితే ఒక్కసారిగా ఎదిగిన రకుల్ ప్రీత్ సింగ్ అదే స్థాయిలో కిందకు పడిపోయింది. తెలుగులో ఈమె సినిమా వచ్చి చాలా కాలం అయింది. అయినా కూడా ప్రేక్షకుల్లో మాత్రం క్రేజ్ తగ్గలేదు.

**కొండపొలం తర్వాత రకుల్ ప్రీత్ సింగ్...** 2021లో కొండపొలం సినిమాలో నటించిన రకుల్ ప్రీత్ సింగ్ తెలుగులో మళ్లీ కనిపించలేదు. ఒకటి రెండు చిన్న చితకా ఆఫర్లు వచ్చినప్పటికీ అవి వర్కౌట్ కాలేదు.



తెలుగులో ఈమె నటించకున్నా తమిళ్, హిందీ సినిమాల్లో నటిస్తోంది. తెలుగులో మాత్రం ఆఫర్ల కోసం ఈ అమ్మడు వెయిట్ చేస్తోంది. ఈ ఏడాది బాలీవుడ్‌లో నటించిన మేరీ హస్బెండ్ కి బీవీ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేదు. కానీ రకుల్ ప్రీత్ సింగ్ మాత్రం హిందీలో మరో ఆఫర్ ను దక్కించుకుంది. గతంలో తాను నటించిన దే దే ప్యార్ దే సినిమాకు సీక్వెల్‌గా రూపొందుతున్న సినిమాలో నటించేందుకు ఎంపిక అయింది. ఇదే ఏడాదిలో ఆ సినిమా రాబోతుంది. షూటింగ్ ముగింపు దశకు చేరుకున్న ఈ సినిమా వచ్చే నెలలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.

**సోషల్ మీడియాలో రకుల్ ప్రీత్ అందాల ఆరబోత...** ఇక రకుల్ ప్రీత్ సింగ్ సోషల్ మీడియాలో ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్‌లో రెగ్యులర్‌గా అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేయడం మనం చూస్తూ ఉంటాం. తాజాగా మరోసారి ఈ అమ్మడు అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేసి అందరి దృష్టిని ఆకర్షించింది. రకుల్ ప్రీత్ సింగ్ ఎప్పటిలాగే ఈసారి కూడా స్కిన్ షో చేయడం ద్వారా చూపు తిప్పనివ్వడం లేదు. పొట్టి నిక్కర్, మినీ డ్రెస్ ను ధరించిన ఈ అమ్మడు అందంకు నిలువెత్తు నిదర్శణం అన్నట్లుగా కనిపిస్తుంది అంటూ అభిమానులు తెగ కామెంట్స్ చేస్తున్నారు. ఇంత అందంగా ఉన్న రకుల్ ప్రీత్ సింగ్‌ను అప్పుడే తెలుగు ప్రేక్షకులు ఎందుకు దూరం పెట్టారో అర్థం కావడం లేదు అంటూ చాలా మంది అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముందు ముందు అయినా తెలుగులో ఈమె రీ ఎంట్రీ ఇచ్చి మంచి విజయాలను సొంతం చేసుకోవాలని అభిమానులు బలంగా కోరుకుంటున్నారు.

# 51లో కూడా చెక్కు చెదరని అందం..!

కొంతమంది హీరోయిన్లు ఎంత ఏజ్ పెరిగినా కూడా ఇంకా పాతికేళ్లు కూడా నిండని అమ్మాయిలాగే కనిపిస్తారు. అయితే ఇప్పుడు మనం చెప్పుకోబోయే హీరోయిన్ అచ్చం అలాగే కనిపిస్తోంది. అందమే అసూయ పడేంత అందంగా ఉన్న ఈ ముద్దుగుమ్మ ఏజ్ 51.. కానీ చూస్తే మాత్రం పాతికేళ్ల అమ్మాయిలాగే కనిపిస్తోంది. మరి ఇంతకీ ఆ ముద్దుగుమ్మ ఎవరో కాదు.. బాలీవుడ్ నటి ఊర్మిళ మతోండ్కర్.. 90'%o% లో ఇండియన్ సినీ హిస్టరీని ఒక ఊపు ఊపిన ఊర్మిళ మతోండ్కర్ తాజాగా ప్రముఖ డిజైనర్ మనీష్ మల్హోత్రా ఇచ్చిన దీపావళి పార్టీలో మెరిసింది. ఈ పార్టీలో ఎంతో మంది సీనియర్ హీరోయిన్లు,ఇప్పటి జనరేషన్ హీరోయిన్లు పాల్గొన్నారు. కానీ వారందరిలో ఊర్మిళ మతోండ్కర్ తన డ్రెస్సింగ్ స్టైల్ తో స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది.. అంతేకాదు తాజాగా ఆ ఫోటోలను ఊర్మిళ తన సోషల్ మీడియా ఖాతాలో కూడా షేర్ చేసి "Glitter.. Glamour.. Stars in All their Glory" అనే క్యాప్షన్ ఇచ్చింది. ప్రస్తుతం ఊర్మిళ మతోండ్కర్ తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేసిన ఫోటోలు చూసిన ఆమె



అభిమానులు హాట్ గా ఉన్నారంటూ ఫైర్ ఎమోజీలను షేర్ చేస్తున్నారు. అంతేకాదు ఇంత ఏజ్ వచ్చినా ఇంకా ఇంత అందాన్ని ఎలా మెయింటైన్ చేస్తున్నారు అంటూ ఆశ్చర్యపోతున్నారు.

ఎద అందాలు హైలైట్ అయ్యేలా ఫుల్ వర్క్ తో ఉన్న టాప్ తో ఊర్మిళ అందం మరింత రెట్టింపు అయింది. ప్రముఖ డిజైనర్ మనీష్ మల్హోత్రా ఇచ్చిన పార్టీలో చాలామంది సీనియర్ కథానాయికలు, యువ కథానాయికలు అందరూ వెరైటీ వెరైటీ డ్రెస్సింగ్ స్టైల్స్ తో ఎంట్రీ ఇచ్చారు. అంతమంది హీరోయిన్లు ఒకే దగ్గర కనిపించడంతో దీపావళి పండగ రాకముందే దీపావళి వైబ్ వచ్చిందని ఆ ఫోటోస్ చూసిన చాలామంది కామెంట్లు పెడుతున్నారు.

ప్రముఖ డిజైనర్ మనీష్ మల్హోత్రా ప్రతి ఏడాది ఇలాగే దీపావళికి ముందు తన ఇంట్లో చాలామంది సెలబ్రిటీలకు పార్టీ ఇస్తూ ఉంటారు. అలా ఈ ఏడాది కూడా దీపావళి కి వారం ముందే సెలబ్రిటీలందరికీ పెద్ద పార్టీ ఇచ్చారు. ఈ పార్టీలో ముకేశ్ అంబానీ భార్య నీతా అంబానీ, ఆమె కోడలు రాధికా మర్చంట్ తో పాటు సీనియర్ హీరోయిన్స్ రేఖ,ప్రీతి జింటా, హేమమాలిని, ఊర్మిళ మతోండ్కర్,కాజోల్, కరీనాకపూర్, సోనాక్షి సిన్హా, వాణి కపూర్ లతోపాటు జెనీలియా,అదితి రావు హైదరి, కృతి సనన్, అనన్య పాండే,మలైకా అరోరా, ఖుషి కపూర్,సారా అలీ ఖాన్, సుహానా ఖాన్ లు మెరిసారు. ప్రస్తుతం ఈ పార్టీకి సంబంధించిన వీడియోలు , ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. అయితే అంత మంది తారల మధ్య సీనియర్ నటి ఊర్మిళ మతోండ్కర్ చాలా స్పెషల్ గా నిలిచింది.. ఊర్మిళను అలా చూసిన ప్రతి ఒక్కరు కచ్చితంగా ఫిదా అయిపోతారు..

# నార్త్ లో రూ.500 కోట్లు.. ఏఏ సినిమాలు వసూలు చేశాయంటే?




నార్త్ మార్కెట్.. ఏ సినిమాకు అయినా అది కీలకం. లాభాలు రావాలంటే అక్కడ మూవీ మంచి వసూళ్లు సాధించాలి. కంటెంట్ బాగుంటే ఆటోమేటిక్ గా కలెక్షన్లు వస్తాయి. అలా అన్ని అంశాలు సెట్ అయితే వందల కోట్ల వసూళ్లు సాధిస్తాయి చిత్రాలు. అయితే ఇప్పటి వరకు నార్త్ లో వివిధ మూవీలు రూ.500 కోట్లు సాధించాయి. ఆ వివరాలు.. బాహుబలి 2: ది కన్క్లూజన్ మూవీ నార్త్ లో రూ.500 కోట్ల క్లబ్ లోకి మొదటగా ప్రవేశించింది. ఆ తర్వాత ఇప్పటి వరకు ఎనిమిది సినిమాలు ఆ మార్క్ ను అందుకున్నాయి. అందులో కొన్ని హిందీ సినిమాలు కూడా ఆ మార్కును తాకగలిగాయి. ఆ సినిమాలు ఏంటి? ఎంత వసూళ్లు సాధించాయి? వంటి వివరాలు తెలుసుకుందాం. 1. బాహుబలి 2: ది కన్క్లూజన్ 2. పుష్ప 2: ది రూల్ 3. స్త్రీ 2 4. జవాన్ 5. పఠాన్ 6. గదర్ 2 7. చావా 8. యానిమల్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ లీడ్ రోల్ లో నటించిన యాక్షన్ ఎంటర్టైనర్ పుష్ప 2: ది రూల్ మూవీ నార్త్ బాక్సాఫీస్ ను షేక్ చేసింది. భారీ వసూళ్లను సాధించి అనేక కొత్త రికార్డులు క్రియేట్ చేసింది. ఫుల్ రన్ లో రూ.750 కోట్ల వసూళు సాధించింది. మరోవైపు, హారర్ కామెడీ మూవీ.. నార్త్ లో రూ.585 కోట్ల కలెక్షన్లు సాధించి సత్తా చాటింది. విక్కీ కౌశల్, రష్మిక ప్రధాన పాత్రల్లో ఛత్రపతి శివాజీ మహారాజ్ తనయుడు ఛత్రపతి శంభాజీ మహారాజ్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన చావా మూవీ అనేక మందిని మెప్పించింది. బాక్సాఫీస్ వద్ద రూ.570 కోట్లు సాధించింది. బాలీవుడ్ బాద్ షా షారుక్ ఖాన్ లీడ్ రోల్ లో నటించి జవాన్ మూవీ.. నార్త్ లో రూ.565 కోట్లకుపైగా కలెక్షన్స్ రాబట్టింది. షారుక్ మరో మూవీ పఠాన్ రూ. 515 కోట్ల మార్కును తాకాయి. యాక్షన్ డ్రామా గదర్ 2 మూవీ రూ.525 కోట్ల వసూళ్లు సాధించింది. రీసెంట్ గా బాలీవుడ్ స్టార్ హీరో రణబీర్ కపూర్ నటించిన యానిమల్ సినిమా.. రూ.500 కోట్లు సాధించాయి. మరి ఫ్యూచర్ లో ఎన్ని సినిమాలు నార్త్ లో రూ.500 కోట్ల వసూళ్లు సాధిస్తాయో వేచి చూడాలి.

# బాలీవుడ్ లో చిన్న సినిమాలకు కలిసొస్తున్న కొత్త ట్రెండ్



రూ.100 కోట్ల క్లబ్ అనేది సినీ ఇండస్ట్రీలో ఉన్న ఎంతోమందికి డ్రీమ్. ఆ క్లబ్ లో తమ సినిమా ఉండాలని చిన్న యాక్టర్ నుంచి అందరూ కోరుకుంటారు. అయితే ఇప్పటికే ఎన్నో సినిమాలు రూ.100 కోట్ల క్లబ్ లో చేరిన సంగతి తెలిసిందే.

బాలీవుడ్ లో ఈ ఇయర్ రూ.100 కోట్ల క్లబ్ లో సినిమాలు ఎక్కువగానే చేరాయి. ఇంకా చెప్పాలంటే ఏ పెద్ద సినిమా రిలీజ్‌కైనా రూ.100 కోట్ల క్లబ్ అనేది ఇప్పుడక్కడ మినిమంగా మారినట్టు అనిపిస్తోంది.

**చిన్న సినిమాలకు కలిసొస్తున్న రూ.100 కోట్ల ట్రెండ్...** ప్రతీ పెద్ద సినిమా ఇప్పుడు రూ.100 కోట్ల క్లబ్ ను టార్గెట్ గా పెట్టుకుని దాన్ని దాటాలని చూస్తోంది. ఈ ట్రెండ్ ఎంతగా మారిందంటే సినిమాకు పెట్టిన మొత్తం బడ్జెట్ రికవరీ అవకపోయినా, రూ.100 కోట్లు కలెక్ట్ చేస్తే ఆ సినిమాను హిట్ గా లెక్కేస్తున్నారు. అయితే ఈ అంశం చిన్న బడ్జెట్ సినిమాలకు మాత్రం బాగా కలిసొస్తుంది. రీసెంట్ గా వచ్చిన ఎన్నో సినిమాలు ఈ విషయాన్ని ప్రూవ్ చేశాయి. ఆమిర్ ఖాన్ సితారే జమీన్ పర్ రూ.100 కోట్లను క్రాస్ చేసి, ఎమోషనల్ కంటెంట్ తో మంచి ప్రశంసలు అందుకుంది. సినిమాకు మిక్స్డ్ రివ్యూస్ వచ్చినప్పటికీ, నెటిజన్లు దాన్ని బ్లాక్ బస్టర్ గా నిలిపారు. తర్వాత అక్షయ్ కుమార్ నటించిన జాలీ ఎల్ఎల్‌బీ3 కూడా రూ.100 కోట్ల మార్క్ ను టచ్ చేసింది.

**నిర్మాతలు సంబరాలు.. డిస్ట్రిబ్యూటర్ల ఆందోళన...** రైడ్2, జాత్, హౌస్‌ఫుల్5, కేసరి చాప్టర్2, సికందర్ లాంటి సినిమాలు కూడా ఈ రూ.100 కోట్ల క్లబ్ లోకి చేరాయి. ఈ విషయంలో నిర్మాతలు సంతోషంగా సంబరాలు చేసుకుంటున్నప్పటికీ థియేటర్ల ఓనర్లు, డిస్ట్రిబ్యూటర్లు మాత్రం ఆందోళన చెందుతున్నారు. సినిమాకు మంచి కలెక్షన్లు వస్తున్నప్పటికీ, వీక్ కంటెంట్ రెండు, మూడు వారాలకు మించి ఆడియన్స్ ఇంట్రెస్ట్ ను నిలబెట్టుకోలేకపోతుందని చెప్తున్నారు. ఇది ఇలానే కంటిన్యూ అయితే థియేటర్లు చాలా సమస్యలను ఎదుర్కోవలసి వస్తుందని కొందరు హెచ్చరిస్తున్నారు. చిన్న, మీడియం బడ్జెట్ సినిమాల సక్సెస్ మారుతున్న ఆడియన్స్ బిహేవియర్ ను తెలియచేస్తుంది. అయినప్పటికీ అసలైన ఛాలెంజ్ సినిమా క్వాలిటీని కాపాడుకోవడంలోనే ఉంది. మరిన్ని కొత్త రిలీజులు, ఫ్రాంచైజీలు వరుసగా రానున్న నేపథ్యంలో ఈ రూ. 100 కోట్ల ట్రెండ్ కంటిన్యూ అవుతుందా లేదా అనేది చూడాలి.

# సంయుక్త 'బ్లాక్ గోల్డ్' కథ ఏంటో..!

మలయాళి ముద్దుగుమ్మ సంయుక్త మీనన్ టాలీవుడ్‌లో ఒక్కసారిగా బిజీ అయింది. ప్రస్తుతం ఈమె చేతిలో దాదాపు అర డజను తెలుగు సినిమాలు ఉండటం విశేషం. కేవలం తెలుగు సినిమాలు మాత్రమే కాకుండా ఇతర భాషల సినిమాలను సైతం ఈమె చేస్తోంది. సంయుక్త మీనన్ చివరగా 2023లో డెవిల్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. గత ఏడాది లవ్ మీ సినిమాలో నటించినప్పటికీ అది గెస్ట్ అప్పియరెన్స్ మాత్రమే. అంటే దాదాపు రెండేళ్లుగా సంయుక్త మీనన్ నటించిన సినిమాలు రాలేదని చెప్పాలి. ఆ గ్యాప్‌ను బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో సంయుక్త మీనన్ ఫిల్ చేసే విధంగా వరుస సినిమాలకు కమిట్ అయింది. ప్రస్తుతం ఈమె చేతిలో అఖండ 2, స్వయంభూ సినిమాలు ఉన్నాయి. ఇవి కాకుండా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో విజయ్ సేతుపతి హీరోగా నటిస్తున్న సినిమాను కూడా సంయుక్త చేస్తుంది.

**యోగి దర్శకత్వంలో సంయుక్త మీనన్..** తెలుగులో ఈమె కొత్తగా యోగి దర్శకత్వంలో ఒక సినిమాకు కమిట్ అయింది. చాలా ఏళ్ల క్రితం వెంకటేష్ హీరోగా వచ్చిన చింతకాయల రవి సినిమాకు



దర్శకత్వం వహించిన యోగి మళ్లీ ఇన్నాళ్లకు ఒక లేడీ ఓరియంటెడ్ సినిమాను చేస్తున్నాడు. ఆ సినిమాలో హీరోయిన్‌గా సంయుక్త మీనన్ నటిస్తుంది. ఇప్పటికే షూటింగ్ ప్రారంభం అయిందని, దాదాపుగా సగం షూటింగ్ పూర్తి అయిందనే వార్తలు వస్తున్నాయి. కానీ ఇప్పటి వరకు మేకర్స్ నుంచి అధికారికంగా ప్రకటన రాలేదు. తాజాగా ఈ సినిమాకు బ్లాక్ గోల్డ్ అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. టైటిల్‌కి తగ్గట్లుగా ఈ సినిమా కథాంశం ఉంటుందని, సినిమాకు ఈ టైటిల్ సరైన నిర్ణయం అంటూ చాలా మంది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారట. అందుకే ఈ టైటిల్ విషయంలో మేకర్స్ తుది నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది.

**బ్లాక్ గోల్డ్ సినిమాలో సంయుక్త మీనన్...** బ్లాక్ గోల్డ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ సినిమాలో సంయుక్త మీనన్ చాలా విభిన్నమైన పాత్రలో కనిపించబోతున్నట్లు తెలుస్తోంది. సంయుక్త ఇప్పటి వరకు పోషించిన పాత్రలతో పోల్చితే ఈ సినిమాలోని పాత్ర చాలా విభిన్నంగా, వైవిధ్యభరితంగా ఉంటుందని అంటున్నారు. పైగా సంయుక్త మీనన్ గతంలో ఎప్పుడూ లేని విధంగా చాలా బలమైన పాత్రలో కనిపించబోతుందనే వార్తలు వస్తున్నాయి. కేవలం తెలుగు ప్రేక్షకులు మాత్రమే కాకుండా అన్ని భాషల ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే విధంగా ఈ లేడీ ఓరియంటెడ్ మూవీ ఉంటుంది అంటూ చిత్ర యూనిట్ సభ్యులు చెబుతున్నారు. బ్లాక్ గోల్డ్ సినిమా వచ్చే ఏడాది సమ్మర్ లేదా అంతకంటే ముందే వచ్చే అవకాశాలు ఉన్నాయి.

# రాధికకి అక్కడైనా కలిసి వచ్చేనా..?

మెహబూబా సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ నేహా శెట్టి. కెరీర్ ఆరంభంలో టాలీవుడ్ నుంచి ఈమెకు వచ్చిన ఆఫర్లు నిరాశనే మిగిల్చాయి. అయినా కూడా లక్ కలిసి రావడంతో సిద్దు జొన్నలగడ్డ హీరోగా చేసిన 'డీజే టిల్లు' సినిమాతో మంచి గుర్తింపు దక్కించుకుంది. ఆ సినిమా ఖచ్చితంగా నేహా శెట్టి కెరీర్‌కి టర్నింగ్ పాయింట్‌గా నిలుస్తుంది అనడంలో ఎలాంటి సందేహం లేదని అంతా అనుకున్నారు. నిజంగానే ఆ పాత్ర ఎప్పటికీ గుర్తుండిపోతుంది, కానీ ఆ సినిమా తర్వాత నేహా కి పెద్దగా ఆఫర్లు రాలేదు, వచ్చిన ఒకటి రెండు సినిమాలు సైతం బాక్సాఫీస్ వద్ద పెద్దగా ప్రభావం చూపించలేదు. పెద్ద హీరోల నుంచి ఈమెకు పిలుపు రాలేదు. దాంతో నేహా శెట్టి కెరీర్ టాలీవుడ్‌లో ముగిసినంత పనైంది. అలాంటి సమయంలో ఓజీలో ఐటెం సాంగ్ చేసే అవకాశం దక్కింది. అయితే ఆ పాట తీసేసి, మళ్లీ పెట్టడంతో ఉందా లేదా అన్నట్లుగానే చాలా మంది ఓజీలో నేహా శెట్టి గురించి మాట్లాడుకుంటున్నారు.

**టిల్లు స్క్వేర్, గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి సినిమాల్లో...** గత ఏడాది టిల్లు



స్క్వేర్ సినిమాలో గెస్ట్ అప్పియరెన్స్ ఇవ్వడంతో పాటు, గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి సినిమాలో ఫుల్ హీరోయిన్ రోల్‌లో కనిపించింది. ఆ రెండు సినిమాలు సైతం నేహా శెట్టికి ఆఫర్లు తెచ్చి పెట్టలేదు. ఇప్పటికీ అభిమానులతో రాధిక అంటూ ప్రేమగా పిలిపించుకుంటున్న నేహా శెట్టి తెలుగు సినిమాల్లో ఆఫర్లు దక్కించుకోవడంలో విఫలం అవుతుంది. ఆఫర్ల కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్న ముద్దుగుమ్మకు చాలా పెద్ద ఛాన్స్ డ్యూడ్ రూపంలో దక్కింది. తమిళ యంగ్ అండ్ ట్యాలెంటెడ్ హీరో ప్రదీప్ రంగనాథన్ డ్యూట్ సినిమాలో హీరోయిన్‌గా నేహా శెట్టి నటించడంతో కెరీర్ పై మళ్లీ ఆశలు మొదలు అయ్యాయి. డ్యూడ్ సినిమాపై అంచనాలు భారీగానే ఉన్నాయి. ప్రదీప్ ప్రతి సినిమా మినిమం ఉంటుంది, ఆయనతో నటించిన హీరోయిన్స్‌కి కూడా మంచి గుర్తింపు, స్టార్‌డం దక్కిన సందర్భాలు ఉన్నాయి కనుక నేహా శెట్టి టైం మారినట్లుగా అనిపిస్తోందని అభిమానులు అంటున్నారు.

**డిజే టిల్లు రాధికగా నేహా శెట్టి..** ఈ వారం ప్రేక్షకుల ముందుకు రాబోతున్న డ్యూడ్ సినిమా ప్రమోషన్‌లో నేహా శెట్టి ప్రముఖంగా కనిపిస్తోంది. ఈ సినిమాలో మెయిన్ హీరోయిన్‌గా మమితబైజు ఉన్నప్పటికీ ఖచ్చితంగా నేహా శెట్టి పాత్రకు ప్రాధాన్యత ఉండే ఉంటుంది అనే అభిప్రాయంను ట్రైలర్ ను చూసిన వారు వ్యక్తం చేస్తున్నారు. నేహా శెట్టికి ఈ సినిమా హిట్ అయ్యి, పాత్రకు గుర్తింపు దక్కితే కోలీవుడ్ నుంచి ఆఫర్లు రావడం ఖాయం అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. రాధిక తెలుగు ప్రేక్షకులను మెప్పించినా మేకర్స్ నుంచి ఆఫర్లు అందుకోలేక పోతుంది. అందమైన రూపం ఉన్నప్పటికీ ఆమెకు లక్ కలిసి రావడం లేదు. టాలీవుడ్‌లో ఆమె మళ్లీ కనిపిస్తుందా అనే అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. ఇలాంటి సమయంలో కోలీవుడ్‌లో ఈమెకు కాలం కలిసి వచ్చేనా అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆమె సైతం చాలా ఆసక్తిగా ఉన్నట్లు తెలుస్తోంది.



# ఛత్తీస్‌గఢ్ పోలీసుల ఎదుట లొంగిపోయిన ఆశన్న

చర్ల: మావోయిస్టు అగ్రనేత, పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న అలియాస్ రూపేష్ పోలీసుల ముందు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో ఆశన్న సహా 208 మంది మావోయిస్టులు ఉన్నారు. మావోయిస్టు చరిత్రలో ఇదే అతిపెద్ద లొంగుబాటు. వారిలో 110 మంది మహిళలు, 98 మంది పురుషులు ఉన్నారు. 153 ఆయుధాలు అప్పగించగా.. వీటిల్లో 19 ఏకే-47 రైఫిళ్లు, 17 ఎస్ఎల్ఆర్ రైఫిళ్లు, 23 ఇన్సాస్‌లు, 1 ఇన్సాస్ ఎల్ఎంజీ, 303 రైఫిళ్లు, 11 బీజీఎల్, నాలుగు కార్బైన్‌లు, 41 బోర్ షాట్‌గన్‌లు, పిస్తోళ్లు ఉన్నాయి. మావోయిస్టు పార్టీ అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ ఆయుధాలను వీడి 60 మంది ఉద్యమ సహచరులతో కలిసి జనజీవన స్రవంతిలో కలిసిన గంటల వ్యవధిలోనే ఆశన్న లొంగుబాటు ప్రకటన వచ్చింది. ఇద్దరు అగ్రనేతలు పోరాటాన్ని వీడటంతో మావోయిస్టు పార్టీకి గట్టి షాక్ తగిలింది.

**మావోయిస్టు అగ్రనేత ఆశన్న భావోద్వేగ సందేశం...** ఆశన్న స్వస్థలం ములుగు జిల్లా వెంకటాపూర్ (రామప్ప) మండలంలోని నర్సింగాపూర్ గ్రామం. నాలుగు దశాబ్దాల క్రితం పీపుల్స్‌వార్ ఉద్యమం వైపు ఆకర్షితులయ్యారు. వాసుదేవరావు ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు మండలంలోని లక్ష్మీదేవిపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. అనంతరం అప్పటి హనుమకొండ మండలం కాజీపేటలోని ఫాతిమా స్కూల్‌లో సెకండరీ విద్యనభ్యసించారు. కాకతీయ వర్సిటీలో డిగ్రీ చదువుతూ రాడికల్ స్టూడెంట్ యూనియన్(ఆర్ఎస్‌యూ)కు నాయకత్వం వహిస్తూ ఆ తర్వాత పరిణామాల నేపథ్యంలో 25 ఏళ్ల వయసులోనే అజ్ఞాతంలోకి వెళ్లారు. ప్రస్తుతం వాసుదేవరావు వయసు 60 ఏళ్లు పైబడి ఉంటుందని ఇంటెలిజెన్స్ వర్గాలు భావిస్తున్నాయి. కీలక దాడులకు ఆశన్న వ్యూహకర్త. దండకారణ్య సబ్‌జోనల్ బ్యూరో కార్యదర్శిగా రూపేశ్ పేరుతో వ్యవహరించిన ఆశన్న.. ఏపీ సీఎం చంద్రబాబు, మాజీ సీఎం నేదురుమల్లి జనార్దనరెడ్డిలపై బాంబులు పేల్చి హత్యాయత్నం, 1999లో ఐపీఎస్ అధికారి ఉమేశ్‌చంద్ర హత్య, 2000లో నాటి హోంమంత్రి మాధవరెడ్డి హత్య లాంటి ఘటనలకు నేతృత్వం వహించినట్లు చెబుతారు.



# రూ.110 కోట్ల భూమిని కాపాడిన హైడ్రా

హైదరాబాద్: గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని కుల్సుంపురాలో ఆక్రమణలను హైడ్రా తొలగించింది. 1.30 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంది. రూ.110 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. ప్రజావసరాలకు ఈ భూమిని వినియోగించాలని గతంలో ప్రభుత్వం భావించింది. మరోవైపు అశోక్ సింగ్ అనే వ్యక్తి దీన్ని తన భూమిగా చెబుతున్నాడు. ఈక్రమంలో సిటీ సివిల్ కోర్టు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఈ భూమిలో ఇప్పటికే రెండు సార్లు రెవెన్యూ అధికారులు ఆక్రమణలను తొలగించారు. అయినా అశోక్ సింగ్ స్థలాన్ని ఖాళీ చేయడంలేదు. మరోవైపు ఖాళీ చేయించేందుకు ప్రయత్నించిన అధికారులపై దాడులకు పాల్పడ్డాడు. అశోక్ సింగ్‌పై లంగర్‌హౌస్, మంగళ్‌హాట్, శాహినాయత్‌గంజ్ పోలీసు స్టేషన్లలో 8కి పైగా కేసులు నమోదయ్యాయి.



# హ్యామ్ రోడ్ల నిర్మాణంపై ప్రతిపాదనలకు ఆహ్వానం

హైదరాబాద్: తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో హ్యామ్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు ఆహ్వానిస్తూ పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం నోటిఫికేషన్ జారీ చేసింది. నిర్మాణ సంస్థల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానిస్తూ ఈ నోటిఫికేషన్ ఇచ్చింది. 30 నెలల్లో రోడ్లు నిర్మించి 15 ఏళ్లు నిర్వహించాలని అందులో వెల్లడించారు. మొదటి విడతలో రూ.6,294 కోట్ల ఖర్చుతో 2,162 రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. 17 ప్యాకేజీల్లో 7,449 కిలోమీటర్ల రోడ్లను పంచాయతీరాజ్ శాఖ నిర్మించనుంది.



# భాజపా నేతలు దిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలి

ఖమ్మం: బీసీ రిజర్వేషన్ల బిల్లును తెలంగాణ అసెంబ్లీలో ఆమోదించి పంపినా కేంద్ర ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు.

ఈ విషయంపై ప్రధానిని కలిసేందుకు సీఎం రేవంత్ లేఖ రాసినా ఆయన సమయమివ్వలేదని చెప్పారు. ఖమ్మంలో భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. ఈ అంశంలో రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు చొరవ తీసుకుని అఖిలపక్షాన్ని దిల్లీకి తీసుకెళ్లాలని భట్టి విక్రమార్క కోరారు. ప్రధాని సమయం ఇస్తే.. అఖిలపక్షంతో కలిసి వచ్చేందుకు సీఎం రేవంత్ సిద్ధమని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేపట్టిన విషయాన్ని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. బీసీ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదించేందుకు భాజపా ఎందుకు అడ్డుపడుతోందని ఆయన ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై బీసీ సంఘాలు చేపట్టిన తెలంగాణ బంద్ భాజపా వైఖరికి వ్యతిరేకంగా జరుగుతోందన్నారు. దీనికి కాంగ్రెస్ శ్రేణులతో పాటు అందరూ మద్దతు తెలపాలని కోరారు.

# సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలపై దృష్టి పెట్టాలి: బీఎస్ఎఫ్ డీజీ దల్జీత్ సింగ్ చౌదరి



హైదరాబాద్: మాదక ద్రవ్యాలు, స్మగ్లింగ్, టెర్రరిజాన్ని అడ్డుకోవడంలో ఐపీఎస్‌లే కీలకమని బీఎస్ఎఫ్ డీజీ దల్జీత్ సింగ్ చౌదరి అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 77వ ఐపీఎస్ బ్యాచ్ పాసింగ్ అవుట్ పరేడ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మానవ హక్కులను కాపాడాలని, ముందున్న సవాళ్లు అధిగమించాలని పిలుపునిచ్చారు. సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలపై దృష్టి పెట్టాలన్నారు. ధనవంతులు, పేదవారిని ఒకేలా చూడాలని సూచించారు. "ఆపరేషన్ సిందూర్‌లో పోలీసు సిబ్బంది ఎంతో సహకారం అందించారు. సాయుధ దళాలతో కలిసి పనిచేశారు. సాంకేతికత మీద మాత్రమే ఆధారపడొద్దు.. క్షేత్ర స్థాయిలో పని చేయాలి. పోలీసు స్టేషన్ అనేది ప్రతి పౌరుడికి మొదటి నమ్మకం. ఐపీఎస్‌లుగా మీకు ఎన్నో ఒడుదొడుకులు ఉంటాయి. ఆరోగ్యం, ఫిట్‌నెస్ కూడా చాలా ముఖ్యం. మీరు బలంగా ఉంటేనే విధుల్లో సమగ్రంగా రాణించగలరు. కొత్త చట్టాలను పటిష్ఠంగా అమలు చేయండి. క్షేత్రస్థాయిలో ప్రతిరోజు ఒక సవాలే. రాజ్యాంగానికి లోబడి పని చేస్తే ఉన్నతంగా ఉండగలరు. మీరు ఐపీఎస్‌లు మాత్రమే కాదు.. పేదలను ఆపద నుంచి కాపాడే సంరక్షకులు" అని దల్జీత్ సింగ్ చౌదరి అన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టులో విచారణ.. ప్రభుత్వం, ఈసీకి సూటి ప్రశ్న





హైదరాబాద్, అక్టోబర్ 17: తెలంగాణ స్థానిక ఎన్నికల నిర్వహణపై కీలక పరిణామాలు చూటుచేసుకుంటున్నాయి. తాజాగా హైకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. స్థానిక ఎన్నికలపై రీనోటిఫికేషన్ ఇచ్చి ఎన్నికలు నిర్వహించాలని పిటిషన్ లో దాఖలు చేశారు. సుప్రీంకోర్టు ఈసీ నోటిఫికేషన్ ను సస్పెండ్ చేయడాన్ని సవాల్ చేస్తూ పిటిషన్ న్యాయవాది సురేందర్ పిటిషన్ వేశారు. దీనిపై ఇవాళ అత్యున్నత న్యాయస్థానంలో విచారణ జరిగింది. వాదనలు విన్న హైకోర్టు.. ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పాలని ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ ను ప్రశ్నించింది. ఎన్నికలు నిర్వహణపై సమాధానం చెప్పేందుకు రెండు వారాల సమయం ఇవ్వాలని న్యాయస్థానాన్ని ప్రభుత్వం, ఈసీ కోరింది. దీంతో హైకోర్టు ఇందుకు అంగీకరించి రెండు వరాల సమయం ఇచ్చింది. అనంతరం విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 9 జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ జీవో ప్రకారమే ఎన్నికల సంఘం ఎన్నికల నోటిఫికేషన్? విడుదల చేసింది. అయితే హైకోర్టు ఆ జీవోపై స్టే విధించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. విచారణ చేపట్టకుండానే అత్యున్నత న్యాయస్థానం సైతం రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్?ను కొట్టివేయడంతో రిజర్వేషన్ల పంచాయితీ అగమ్యగోచరంగా మారింది. దీనితో స్థానిక ఎన్నికల ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. అటు ప్రభుత్వం నుంచి ఆర్డర్స్ రాకపోతే పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించిన విషయం తెలిసిందే.

# హీరోయిన్ల ఓటర్ కార్డులు ఫేక్.. తేల్చిన ఈసీ, కేసు నమోదు




హైదరాబాద్, అక్టోబర్ 17: హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రముఖ హీరోయిన్లకు ఓటు ఉందంటూ ఓటర్ కార్డులు సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయం తెలిసిందే. టాలీవుడ్ హీరోయిన్లు తమన్నా, సమంత, రకుల్ ప్రీత్‌సింగ్ పేరుతో ఓటర్ల జాబితా సోషల్ మీడియాలో హల్చల్ అయింది. ఓటర్ల జాబితా సర్క్యులేషన్‌పై సిరియస్ అయిన ఎన్నికల అధికారులు.. తాజాగా ఆ ఓటరు జాబితా ఫేక్ అని తేల్చారు. ఈ మేరకు అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ సయ్యద్ యాహియా కమల్ మధుర నగర్ పోలీసులకు పిర్యాదు చేశారు. ఎన్నికల అధికారి పిర్యాదు మేరకు 336(4), 353(1)(C) BNS సెక్షన్ల కింద పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. గత రెండు రోజులుగా జూబ్లీహిల్స్‌లో ప్రముఖ హీరోయిన్లకు ఓటు ఉందంటూ ఫేక్ ఓటర్ కార్డులు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. టాలీవుడ్ హీరోయిన్లు రకుల్ ప్రీత్ సింగ్, సమంత, తమన్నాల ఫోటోలతో ఫేక్ ఓటర్ ఐడీలు క్రియేట్ చేసి కేటుగాళ్లు ప్రచారం చేశారు. వేరే ఓటర్ల ఎపిక్ నంబర్ తో హీరోయిన్ల ఫోటోలు పెట్టి ఓటర్ ఐడీ కార్డులు తయారు చేశారు. ఈ ఓటర్ ఐడీల ప్రచారంపై హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడ వీటిని ఫ్యాబ్రికేట్ చేశారు? ఎవరు ప్రచారం చేశారు? అన్న అంశాలపై ఎన్నికల సంఘం విచారణ చేపట్టింది. సోషల్ మీడియాలో వైరల్ చేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# బీసీ రిజర్వేషన్ల అంశంపై ప్రభుత్వానికి లేఖ రాశాం.. హైకోర్టుకు తెలిపిన ఎన్నికల సంఘం



హైదరాబాద్: బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన అంశంపై ప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది విద్యాసాగర్ హైకోర్టుకు తెలిపారు. ప్రభుత్వం నుంచి సమాధానం వచ్చిన తర్వాత తదుపరి చర్యలు చేపడతామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేలా రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలంటూ సురేందర్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సీజే ధర్మాసనం విచారణ చేపట్టింది. పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘాన్ని గత విచారణ సందర్భంగా ఆదేశించినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఇటీవల విడుదల చేసిన స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌ను నిలుపుదల చేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ప్రభుత్వం రిజర్వేషన్లను మరోసారి ఖరారు చేయాల్సి ఉందన్నారు. ఈ మేరకు ప్రభుత్వానికి లేఖ కూడా రాశామని.. సమాధానం వచ్చిన తర్వాత తదుపరి చర్యలు చేపడతామని వివరించారు. ప్రభుత్వం నిర్ణయం చెప్పడానికి 3 వారాల సమయం కావాలని ప్రభుత్వం తరఫు న్యాయవాది కోర్టును కోరారు. ఈక్రమంలో ప్రభుత్వానికి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు 2 వారాల గడువు ఇచ్చి కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

# బీసీ బంద్‌కు కవిత మద్దతు : కవిత




హైదరాబాద్, అక్టోబరు17 : బంద్ ఫర్ జస్టిస్ పేరుతో రేపు (అక్టోబర్ 18)వ తేదీన బీసీ సంఘాలు బంద్‌కి పిలుపునిచ్చాయి. బీసీ రిజర్వేషన్లు ఆమోదించాలంటూ బీసీ సంఘాలు ఆందోళన నిర్వహించనున్నాయి. ఈ క్రమంలో బీసీల బంద్‌కు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మద్దతు తెలపాలని తెలంగాణ బీసీ జేఏసీ చైర్మన్ ఆర్.కృష్ణయ్య లేఖ రాశారు. అయితే, ఆర్. కృష్ణయ్య లేఖపై స్పందించారు కవిత. బీసీ బంద్‌కు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. బీసీల రిజర్వేషన్ల కోసం తాను పోరాడతానని ఉద్ఘాటించారు కవిత. తెలంగాణ అసెంబ్లీ, కౌన్సిల్ పాస్ చేసిన బిల్లులను ఆమోదించకుండా నెలల తరబడి పెండింగ్‌లో పెట్టిన బీజేపీ ఇప్పుడు బంద్‌లో పాల్గొంటోందని... అంటే బీసీ రిజర్వేషన్ల బిల్లులు పాస్ చేసినట్లు భావించాలా..? అని ప్రశ్నించారు. అసెంబ్లీ, కౌన్సిల్‌లో బిల్లులు పాస్ చేసి కేంద్ర ప్రభుత్వంపై కొట్లాడకుండా బీసీ రిజర్వేషన్లపై ఉత్తుత్తి జీవో ఇచ్చిన కాంగ్రెస్ తామే ముందుండి బంద్ చేయిస్తామనడం హాస్యాస్పదంగా ఉందని కవిత విమర్శించారు.



# పసిడి సరికొత్త రికార్డు.. రూ.1.35 లక్షలు దాటిన ధర

హైదరాబాద్: దేశీయ మార్కెట్‌లో బంగారం ధర చుక్కలు తాకుతోంది. అంతర్జాతీయ పరిణామాలు, పండగల సీజన్ కలిసొచ్చి పసిడి దూసుకెళ్తోంది. హైదరాబాద్‌లో రూ.1.35 లక్షలు దాటి పరుగులు పెడుతోంది. శుక్రవారం 24 క్యారెట్ల 10 గ్రాముల పుత్తడి ధర రూ.1,35,250కి చేరుకుంది. 22 క్యారెట్ల నాణ్యమైన 10 గ్రాముల ధర రూ.1,21,725కి చేరుకుంది. కిలో వెండి ధర రూ.1,81,000కి చేరింది. అమెరికా షట్‌డౌన్ ఎత్తివేతపై అనిశ్చితి, యూఎస్-చైనా వాణిజ్య ఉద్రిక్తతలు వంటి పరిణామాలతో బంగారంలో పెట్టుబడులకు మదుపర్లు మొగ్గు చూపుతున్నారు. ఈక్రమంలోనే గోల్డ్ ఈటీఎఫ్‌లకు గిరాకీ విపరీతంగా ఉంటోంది. మరోవైపు, ధనత్రయోదశి నాడు ప్రజలు బంగారం, వెండి, విలువైన ఇతర పాత్రలను కొనుగోలు చేస్తారు. ఇది సంపద, అదృష్టాన్ని తెస్తుందని నమ్ముతారు. ఆ సెంటిమెంట్ కూడా బంగారం ధర పెరుగుదలకు కారణమవుతోంది. దాంతోపాటు పెళ్లిళ్ల సీజన్ నేపథ్యంలో దేశీయ మార్కెట్‌లో పసిడికి మరింత డిమాండ్ ఉంటుందని బులియన్ వర్గాలు అంచనా వేశాయి. వచ్చే ఏడాది ఆరంభం నాటికి బంగారం ధర రూ.1.50 లక్షలకు చేరొచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com